Telugu

నెలవంక

www.nelavankaonline.com البشرى

రజీవుల్ అవ్వల్ హిజ్రీ శకం 1434 - Vol 9, Issue: 76 February 2013 مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى



పేరు మానవీయం తీరు దానవీయం

TELGFEBR13FINAL.indd 1 2/5/13 4:29 PM

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

"వారు ఎన్నో తోటలను, ఊటలను వదలి పోయారు. మరెన్నో పచ్చని పొలాలను, చక్కని నిలయాలను, ఇంకా తాము అనుభవిస్తూ ఉండే విలాసవంతమైన వస్తువులను కూడా (వదలి పోయారు). అంతా ఇట్టే అయిపోయింది. మేము మరో జాతి వారిని వాటన్నింటికీ వారసులుగా చేశాము. వారి స్థితిపై నింగీ, నేలా రోధించలేదు. వారికి కనీసం గడువు కూడా లభించలేదు".

(దివ్యఖుర్‌ఆన్ - 44: 25-29)

ఇలా కాదు;

భువనగగనాలు సయితం చలించాలి.

అలా మనం జీవించాలి!



వెలువరక

(AL-HILAL MONTHLY)

Vol 9, ISSUE: 74

February - 2013

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

EXECUTIVE EDITOR
Sk. Abdul Qadir Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
sk. Mohaamad Bilal
sk. Mohammad Saleem Jamaee

HOTELINE
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE

Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net



2



4



10




14

సీరత్ క్యాంపైన్

(అంతిమ దైవప్రవక్త (స) వారి పవిత్ర జీవిత పరిచయ కార్యక్రమం)

వివరాలకు సంప్రదించండి: 97266676, 60018869



సయ్యద్ అబ్దుస్సలామ్ ఉమ్రి
syed.abdussalam93@gmail.com

పేరు మానవీయం తీరు దానవీయం



సన్నితంగా ఉండాల్సిన మానవ సంబంధాలు కాస్త పురుషాహంకార ధోరణి ప్రభావమో అని సమాజం లోనూ, బతికే వ్యవస్థలోనూ, ఇద్దరు సమ ఉజ్జీల మధ్య సతీ భాగస్వాముల మధ్య ఉండాల్సిన బంధ వ్యాప్తికి బదులు యుద్ధమాని, బిన్న లాంటి వాతావరణం నెలకొని ఉండటం బాధాకరం!

గుడ్డెద్దు చేలో పడినట్లుగా ఆకుకు అందని, పోకుకు పొందని ప్రతిపాదనలతో స్వేచ్ఛ పేరుతో ప్రముదల పరువును పాశ్చాత్య దుష్ప్రభావ పాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారు తప్ప స్త్రీకి సంబంధించిన సమస్య మూలాలను శోధించి సరైన పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదు నాయక శ్రేణులు. తన ప్రాణం, తన మానం బలుపైనదని, ఎదుటి వారి ప్రాణం బలుప లేనిదని భావించే నాయకులు, అధికారులు ఉన్నంత కాలం ప్రజలకు న్యాయం జరగడం అనేది నేతి బీరలో నెయ్యి చందమే.

తెలివి ఏ ఒక్కరి సొత్తు కాదు. అది మనిషి లింగం, వర్ణాన్ని బట్టి ఉండదు. ప్రతిభ సంపత్తిని మనిషి లింగాన్ని బట్టి నిర్ణయించడానికి వీల్లేదు. మేధాశక్తి ఒక లింగానికి, వర్ణానికే సొంతం కాదు. స్త్రీలను కించ పరిచే, న్యూనతకు లోను చేసే పాత్రలు, సంభాషణలు ఇటు సాహిత్యంలోనూ, అటు సినిమాల్లోనూ ఎక్కువే. ఎక్కువ మగ సంతానమే ఉండాలన్న విష భావం మనిషి నరనరాల్లో నాటుకుపోతోంది. ఆడ బిడ్డ దేనికి తక్కువని మగ బిడ్డంటే ఎక్కడ లేని మక్కువ? లింగ వివక్షకి వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు పుట్టాయి. ఇప్పటికీ కొనసాగుతున్నాయి కూడా. కాని జన సామాన్యంలో ఆడ సంతానం పట్ల మమకారాన్ని ప్రోది చేయలేకపోయాయి. అల్లుడే పుట్టిన శిశువుని సంయుత లింగాన్ని బట్టి, వర్ణాన్ని బట్టి నిర్ణయించే దుర్గంధం మన సమాజంలో అమలులో ఉంది.

చట్ట సభల్లో 33/ రిజర్వేషన్ల కోసం పోరాటం సాగుతూంది. మహిళలు దేశాన్ని పరిపాలిస్తున్నారు కూడా. కాని ఇదంతా నెపానికి ఒకవైపు మాత్రమే. నేటికి దేశ వ్యాప్తంగా ఆచారాల పేరుతో ప్రభుత్వం ఎన్నుతో నిషేధించిన జోగిని దురాచారం కొనసాగుతూనే ఉంది. ఒక మన రాష్ట్రంలోనే 24 వేల మంది జోగినులున్నారంటే ఇక దేశమంతా కలిపితే? ఈ వ్యవస్థ మన దేశంలో రకరకాల పేర్లతో కొనసాగుతోంది. కేరళలో 'మతోల' అని, అస్సాంలో 'నాటి' అని, మహారాష్ట్రలో 'మురళి' అని, తమిళనాడులో 'దేవరడియార్' అని, కర్ణాటక మరియు రాయలసీమ కొన్ని జిల్లాల్లో 'బసవి' అని పిలుస్తుంటారు. ఈ వ్యవస్థను గూర్చి తెలుసుకోవడం అంటే ఎందరో అమాయక అబలల కన్నీటి గాథలు తెలుసుకోవడమే.

ఎక్కడో గాని కనిపించని మానవీయం గురించి పెదవి విప్పాలా? ఎక్కడ చూసిన తొండవిస్తున్న దైనవీయం గురించి మాట్లాడాలా? భ్రూణహత్యలు గురించి మాట్లాడాలా? వ్యర్థక మనుష్య చెర్లలు మోసేని చంపే అమానవీయత గురించి మాట్లాడాలా? కొవి వరసల్ని ఖాతరు చెయ్యని వింత పశువుల గురించి మాట్లాడాలా? సొంత బిడ్డల్ని చెరిచే ఉపాధ్యాయుల గురించి మాట్లాడాలా? పెళ్లయితే కొంప, పెళ్ళి కాకపోతే కొంప, గల్లీలో కొంప, ఢిల్లీలో కొంప, యుద్ధకొంప, మతకొంప ఏ కొంప గురించి మాట్లాడాలి? ఎంత కాలం మాట్లాడాలి?

శిశువు తెల్లగా ఎర్రగా ఉంటే పరవాలేదంటారు. నల్లగా ఉంటే అయ్యో పాప కల్లదే అని పెదవి విరుస్తారు. ఆడ శిశువు పుట్టింది మొదలు రకరకాల ఈసడింపులను ఎదుర్కొంటుంది. బిడ్డ పుట్టిన సంతోషంకన్నా ఆడ బిడ్డ పుట్టిందన్న పుట్టెడు దుఃఖమే అధికంగా ఉంటుంది. స్త్రీగా పుట్టడం ఒక అనర్హతగా, ఒక నేరంగా పరిణమిస్తుంది. ఇదే విషయాన్ని ఖుర్‌ఆన్ ఇలా పెర్కొంటుంది: **"వారిలో ఎవరికయినా కూతురు పుట్టిందన్న శుభవార్తను విన్నప్పే, వాడి ముఖం నల్లగా మారి పోతుంది. లోలోపలే కుతకుతలాడిపోతాడు. ఈ దుర్వార్త విన్న తరువాత (ఇక లోకులకు ముఖం ఎలా చూపేది? అని) అతడు నక్కి నక్కి తిరుగుతుంటాడు. ఈ అవమానాన్ని ఇలానే భరిస్తూ బిడ్డను అట్టి పెట్టుకోవాలా? లేక దానిని మట్టిలో పూడ్చి పెట్టాలా? అని (పరిపరి విధాలుగా) ఆలోచిస్తాడు. చూడు! ఎంత జుగుప్సాకరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు వీరు!"** (అన్ నహ్ల్: 58,59)

దేవుని దృష్టిలో ఆడ-మగ వివక్ష లేదు. లింగ ప్రాతిపదికపై నివ్వెన్నతో భేదభావాలు కూడా ఆయన వద్ద చెల్లవు. ఒకటే జనకం, ఒకటే మరణం. ఒక్కరి కోసం అందరం, అందరి కోసం ఒక్కరం కలిసి కట్టుగా ముందడుగేయాలి. ఏ ఒక్కరో కాదు, ఒక జాతి, ఒక కులమో కాదు...మనమంతా ఏకమవ్వాలి. అన్యాయాన్ని అడ్డుకోవడానికి, అధర్మాన్ని నిలదీయడానికి, అక్రమాలను నిలువరించడానికి మానవతా మార్గంలో అడ్డు తగులుతున్న ప్రతిదాన్ని తొలగించడానికి కంకణం కట్టాలి. ఈ ఉద్యమం మరింత ఉధృతం అవ్వాలి. కొన్ని రోజులు కాదు, నిరంతరం సాగాలి. ఇది కేవలం స్త్రీజాతి అభ్యున్నతికై ఆరాటం మాత్రమే కాదు. ఇది మానవాళి మనుగడకై పోరాటం! అలుపెరగకుండా సాగిపోవడమే మనందరి తక్షణ కర్తవ్యం!!

అబ్దుస్సలామ్

TELGFEBR13FINAL.indd 2 2/5/13 4:29 PM



మనం అలా లేమే...!

శాంతిప్రియ

తనను ఒకరితో పోల్చుకోవడం మనిషికి బాల్యం నుండి అలవడే ఓ ప్రక్రియ. ఇది మనిషి జీవితంలో మమేకమయి ఉండటాన్ని మనం గమనించగలం. ఎవరి అస్తిత్వం వారిది. ఎవరి ప్రత్యేకత వారిది. ఎవరి జీవన విధానం వారిది. ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోని కారణంగా మనిషి తన జీవనయానంలో ప్రతి దశలో ఇతరులతో పోల్చుకుంటూ సమస్యల సుడి గుండంలో తనను తాను నెట్టేసుకుంటుంటాడు. అప్పుడప్పుడు పోలిక కొన్ని పనులు చేయడానికి ఉద్దీపనంలా ఉంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే పోల్చుకునే ఈ గుణం అన్ని వేళలా శ్రేయో దాయకం కాదు. శైశవంలో, బాల్యంలో పోల్చుకోవడం వల్ల అనేక విషయాలు నేర్చుకునే అవకాశం ఉంది. ఆ మేరకు అది ఉపయుక్తంగానే ఉంటుంది. కానీ ఒక మనిషి వ్యక్తిత్వం రూపొందే దశలో ఒకరితో పోల్చుకునే ఈ గుణం మానుకోకపోతే తనదైన రీతి, తనదైన ముద్ర ఒకటి ఏర్పడటం కష్టం అవుతుంది. ఏతా వాతా ఇది వ్యక్తిత్వ రాహిత్యానికి దారి తీసి మనిషిని అసంతుష్టుణ్ణి చేస్తుంది. ఏదో కోల్పోయినట్లు అసహనంతో వ్యవహరిస్తుంటాడు. నిజంగా తనేమిటో తనకే తెలియని స్థితి దుర్భరం.

పోల్చుకోవడం మొదలెడితే దాని హద్దూ పద్దూ ఉండదు. చాలా మంది తమల్ని ఇతరుల ఆస్తిపాస్తులతో, హోదా అంతస్థులతో పోల్చుకుని అవి తమకు ప్రాప్తం కాలేదని తీవ్ర అసంతృప్తికి గురవుతుంటారు. ఖచ్చితంగా తమకు ఏం కావాలో తేల్చుకోని వారే ఇలా పోల్చుకుంటుంటారన్నది మానసిక శాస్త్రవేత్తల మాట. ఈ పోల్చుకునే గుణం చివరికి దైవానికి సయితం పోలికలు కల్పించే స్థాయికి దిగజార్చుతుంది. ఫలితం – మనిషి ఇహపరాలు నాశనమవుతాయి. పోతే,

'మనం అలా లేమే' అన్న భావం చాలా మంది స్త్రీలను కృంగదీస్తుంది. **'నాకు అందం లేదనో, నా స్వరం బాగోలేదనో, నేను చాల పొట్టినో, నేను ఫలానావిడలా లేననో'** అంటూ వాపోతుంటారు కొందరు. అర్హత లేని వారు అర్హతను నిరూపించుకునేందుకు పడే పాట్లు తెలియని కావు. అలాగే అందవిహీనంగా ఉన్న అమ్మాయే తొందరగా ఇతరుల ఆకర్షణకి గురవుతుంది అంటారు మానసిక శాస్త్రవేత్తలు. కారణం – తన మీద నమ్మకం కలిగించుకోవడం కోసం.అదే విధంగా **'స్త్రీగా పుట్టడమే నేర'**మని నిరతం నిరాశనిస్పృహలకు లోనయి జీవించే స్త్రీలు పురుషుల్లాంటి దుస్తులు, వారి లాంటి నడవడికను అలవర్చుకుని తాము దేనికీ తక్కువ కామని హాయలు పోతుంటారు. ఈ రెండు ధోరణులు న్యూనతా మూలంగా చోటు చేసుకుంటాయన్నది గమనార్హం. దీనికి భిన్నంగా స్త్రీగా తన వ్యక్తిత్వాన్ని సంపాదించుకునేందుకు కృషి చేయాలి. ఒకరితో మనల్ని మనం పోల్చుకొని మనకు లేని పోలికల కోసం పడే కష్టం, శ్రమ, మనలోని ప్రతిభాపాటవాలను ప్రగతి బాటన నడిపే విషయంలో వెచ్చించినట్లయితే మనకంటూ ఒక గుర్తింపు ఉంటుంది. లేదంటే సాధించిన ఆ కొద్ది ప్రగతి కూడా పోలికలతోనే గుర్తించబడుతుంది. ఈ కారణంగానే న్యూనతకు గురి చేసే ఇటువంటి వైఖరిని నిరసిస్తూ ప్రవక్త మహినీయ (స) ఇలా అభిశపించారు: **"పురుషుల వస్త్రధారణను అలవలంబించే స్త్రీలు, స్త్రీల వస్త్రధారణను అనుకరించే పురుషులు శపించబడ్డారు". (ముస్నద్ అహ్మద్)**

స్త్రీ సమస్య అనేది ఈనాటిది కాదు. ఇది సమాజికపరమైన సమస్య. అందుకని సాంఘిక విప్లవం రావాలి. సరైన ధార్మిక అవగాహనను ప్రజల్లో పెంపొందించాలి. దానికితోడు మనో ధైర్యాన్ని శక్తిలా చేసుకుని పోరాడే వ్యక్తిత్వాన్ని స్త్రీలు పెంపొందించుకోవాలి. **'వంట ఎవరు చేశారు? అంట్లు ఎవరు తోమారు?'** అన్నది కాదు ముఖ్యం. దాంపత్య జీవితంలో సమ ఉజ్జీల మధ్య ఓ అవగాహనతో ఎవరు ఏ పని చేసినా తప్పు లేదు. ఇంటి పని చేయడం స్వేచ్ఛకు అవరోధం అనుకునే స్త్రీలు తమ తమ రంగాల్లో రాణించిన విశ్వాసుల మాతలు కూడా ఆ పనుల్ని ఎంతో చక్కగా నిర్వర్తించారు అని గుర్తించాలి. అలాగే ఇంటి పని, వంట పని చేయడం అవమానంగా భావించే పురుషులు అన్ని రంగాల్లో ఆదర్శంగా అందరి నీరాజనాలందుకున్న మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారు సయితం ఇల్లు ఊడ్చే వారు, కూరగాయలు తరిగేవారు, బట్టలు కుట్టుకునేవారు, వీలైయినంతగా ఇల్లాలికి చేదోడు వాదోడుగా ఉండేవారన్న సంగతిని విస్మరించ కూడదు.

ఎవరయినా తాను కోరుకున్న ఒక వస్తువును పొందలేనప్పుడు అసంతృప్తికి లోనవుతున్నారంటే దానికి అర్థం ఉంటుంది కానీ, ఇతరుల్ని చూసి అసూయతో రగిలిపోతూ, అసంతృప్తికి గురవ్వడం కంటే అర్థరాహిత్యమయిన అంశం మరొకటి ఉండదు. మానసిక లోకంలో మనిషి ఈ ప్రవర్తన అతని మనో వికాస పతనానికి తార్కాణం. అందుకే పోల్చుకోవడం మాని తానేమిటో తెలుసుకుని, తేల్చుకుని వ్యవహరించే వారే ప్రశాంతంగా ఉండగల్గటంతోపాటు అనుకున్నది సాధించగలుగుతారు.

TELGFEBR13FINAL.indd 3 2/5/13 4:29 PM





స్త్రీ విముక్తికి త్రి సూత్రాలు

షేఖ్ అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ

(కొత్త సంవత్సరం ఎన్నో ఆశలు, అశయాలు, ఆకాంక్షలతోపాటు మరెన్నో అనుమానాలు, ప్రశ్నలను వెంటబెట్టుకొచ్చింది. కొత్త సంవత్సరం వచ్చిన ప్రతిసారీ జీవితంలో అంతా నవ్యంగా కాకపోయినా సవ్యంగా జరగాలను కుంటాము. కానీ అలా జరగడం లేదు. అందుకు దేశరాజధానిలో జరిగిన 'నిర్భయ' ఉదంతమే సాక్ష్యం! నిన్న వరంగల్‌లో స్వప్నిక, మొన్న విజయవాడలో ఆయిషా మీరా, ఆపై శ్రీలక్ష్మీ, నిన్న హైదరాబాదులో అరుణ ...ఇలా మహిళా భద్రత దిగజారుతున్న పరిస్థితులకు ఇవన్నీ రుజువులే! అంతేనా, మణిపూర్‌లో ఉద్యోగిని, అసోమ్‌లో విద్యార్థిని, కర్నాటకలో గృహిణి, తమిళనాడులో బాలిక...దేశమంతా కామాంధుల కరాళ నృత్యానికి బలవుతోంది మహిళ. ఈ కామ కాటుకు తరతమ భేదాలు, తన, పర భేదాలు లేవు. మానవజాతి మనుగడకు ప్రాణం పోసిన మగువ మాన, ప్రాణాలకు రక్షణ కరువైన తరుణం ఇది! తరుణీమణుల ఆత్మ స్థయిర్య సాధనకు అగ్ని పరీక్షా సమయమిది!! ఈ నేపథ్యంలో **నెలవంక** ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు అందించిన వ్యాసమే ఇది.

- ఎడిటర్)

నేడు ఒక వైపున ఆడపడచులు చదువులోనూ కొలువులోనూ ముందుకు దూసుకొని పోతూ **'హమ్ కిసీసె కమ్ నహీ'** మేమూ అనుకున్నది సాధించగలం అంటూ 'విజయ భేరి'ని మ్రోగిస్తున్నారు. ఇది ఎంతైనా హర్షించ దగ్గ విషయమే. ఇది ఒక కోణం. ఎంత చదువుకున్నా, పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా, సమర్థురాలిగా నిరూపించుకున్నా, స్వయంకృషితో తనకంటూ ఓ గుర్తింపును సంపాదించుకున్నా అనుదినం ఉన్మాదుల అఘాయిత్యాలకు బలవుతున్నారు అబలలు. ఇది మరో కోణం.నారీమణులు నవ యుగానికి నాంది వాచకాలవ్వాలంటూ నినదించే నాయకమన్యులు సయితం స్త్రీ అణచివేతపై శీతకన్ను వేశారు.ఆ మాట కొస్తే **'స్త్రీలను గౌరవిద్దాం, వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం'** అన్న మాటను గౌరవ భావంతో చూసే పౌరుల సంఖ్య ఎంత?

స్త్రీమూర్తి-వివాహిత అయినా అవివాహిత అయినా ఆమెకు సమాజంలో రక్షణ కరువైపోయింది. కాలేజిలో ఉన్మాది వేధిస్తున్నాడని చదువు మానేసి ఇంట్లో ఉంటున్న అమ్మాయికీ భద్రత అంతంత మాత్రమే. భర్త పిల్లలతో సంతోషంగా జీవిస్తున్న ఇల్లాలి శీలానికీ రక్షణ పూజ్యమే. చివరికి రక్షణాలయాలలో కూడా భద్రత లేని దుస్థితి. 'ఆధునికం' అని మనం గొప్పలు మాత్రం చెప్పుకుంటున్నాము కానీ, నిజంగా మనం నేటికీ ఆటవికంలోనే జీవిస్తున్నాము.

'అబలలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపండి' అంటూ నినాదాలు అయితే వినబడుతున్నాయి. ఎవరు ఆపాలి? ఎలా ఆపాలి? చర్చించవలసిన అవసరం లేదా? సామాజిక స్పృహ అంటే ఏమిటో తెలుసుకోవాల్సిన కనీస బాధ్యత దేశ పౌరులుగా మనది కాదా? అన్యాయాన్ని ఎదుర్కోవడానికి, అత్యాచారాన్ని నియంత్రించడానికి కావాల్సింది మానవీయ విలువల పట్ల గౌరవం. పరిస్థితుల, పరిసర ప్రభావాల పట్ల, సంఘ తీరుతెన్నుల పట్ల సరైన దృక్పథం, సమాజాన్ని సంస్కరించాలన్న దృఢ సంకల్పం, ప్రశ్నించే తత్వం, సాధించగలమనే ఆత్మ విశ్వాసం. ఈ భావాలన్నీ దాదాపు అందరిలోనూ ఉంటాయి. అయితే, కొన్ని అడుగంటి పోయాయి. ఇంకొన్ని జీవం కోల్పోయాయి. మరికొన్ని నిర్లిప్తతలో పడి కొట్టుకు పోతున్నాయి. ఒక దేశ సత్పౌరులుగా మనం చేయాల్సిందిల్లా వాటిని కూడగట్టుకోవడం, తిరిగి రెట్టింపు శక్తితో పోరాడటం.

TELGFEBR13FINAL.indd 4 2/5/13 4:29 PM

అబలల రక్షణ కోసం ఇస్లాం ప్రతిపాదించే కొన్ని సూత్రాల్ని ఇక్కడ పొందు పరుస్తున్నాము.

మొదట సూత్రం: వయసుకు వచ్చిన పిల్లల్ని వివాహం చేసెయ్యాలి.

మానవ నైజంలో లైంగిక కోర్కెల్ని ఉంచాడు విధాత. ఆ కోర్కెల్ని అదుపులో ఉంచడానికి, ధర్మసమ్మతంగా కోర్కెల తృప్తి కోసం వివాహ వ్యవస్థను నియమించాడు **"మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో; మీ స్త్రీ పురుష బానిసలలో ఎవరు గుణవంతులో, వారి వివాహాలు చేసి వేయండి. వారు గనక పేదవారయితే అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేస్తాడు. అల్లాహ్ అంతులేని వనరులు కలవాడు. సర్వమూ తెలసినవాడు".** (అన్నూర్:32)

వివాహం లేకుండా ఎవరూ ఉండ కూడదని, వివాహ విషయంలో పేదరికం అడ్డు రాకూడదని తెలియజేస్తూ తమ సంరక్షణలో ఉన్న వారి వివాహాలు చేయడంలో కుటుంబ పెద్దల జాప్యం కూడదని త్వర పడాలని అల్లాహ్ తాకీదు చేస్తున్నాడు.

ఆలోచించవలసిన విషయం ఏమిటంటే, యువత ఆర్థికంగా బలపడిన తరువాతే వారి వివాహాలు చేయాలన్న ఆలోచన తప్పు కాదు. కాని **'సంపాదన లేదు'** కదా అంటూ వివాహాల విషయంలో జాప్యం చేయడం వల్ల వారు అడ్డ దారులు త్రొక్కే ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి వివాహాలను సులభతరం చెయ్యాలి. విలాసవంతమైన జీవితాన్ని కాంక్షించకుండా, వరకట్నాన్ని రూపుమాపి లైంగిక విశృంఖలత్వాన్ని అరికట్టడానికి కుటుంబ సంరక్షకులు పెద్దలు అన్నివిధాలా కృషి చేయాలి.

రెండవ సూత్రం: అశ్లీలతను అంతమొందించాలి.

సమాజంలో అందరూ ఒకేలా ఆలోచించరు. పుట్టి పెరిగిన వాతావరణమే కాదు, అంగాంగ ప్రదర్శనే ధ్యేయంగా ఉండే సినిమాలు, నీలి చిత్రాలు, అశ్లీల వ్యాపార ప్రకటనలు, పాశ్చాత్య దుష్కృతి అనుకరణలు, వీపరీత పోకడలు ..విచ్చలవిడితనాలు...క్లబ్బులు..ప్లబ్బులు... తెలిసీ తెలియని వయసు యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయి. ప్రమాదపుటంచుల వైపు తీసుకెళుతున్నాయి. వీటన్నింటినీ నియంత్రించాల్సిన ప్రభుత్వం నీళ్లు నములుతోంది. కారుణ్య ప్రభువు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు **"విశ్వాసుల వర్గంలో అశ్లీలత వ్యాపించాలని కోరేవారు, ప్రపంచంలోనూ,పరలోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులు".** (24:19)

'నిర్భయ'ను రాజధానిలో నరులు నడిచి వెళుతున్న నడిరొడ్డు మీద వివస్త్రను చేసి నర రూప రాక్షసులు నిర్దయగా విసిరేస్తే **'మగువ కు మానమే ప్రాణం'** అని తెలిసిన మనుషులకు వస్త్రం కప్పాలన్న కనీస మానవత్వం కరువవ్వడం చూసి భూమి విలపించింది. ఆకాశం ప్రకోపించి, ప్రకంపించింది.కానీ పాషాణ హృదయం చలించలేదు. మరోసారి **'మృగాల కన్నా హీనం మానవ సంస్కృతి'** అని నిరూపించుకుంది. మన ప్రక్కనే ఒకరు వేధించబడుతున్నా **'మనకెందుక'**ని స్పందన చచ్చిన శవంలా ఉండి పోవడం సబబేనా? నేడు ఒకరికి, రేపలా మన ఆత్మీయులకే, మనకే జరగొచ్చు. ఒక కాకికి ఏదయినా జరిగితే కాకులు సమూహాల్లా కూడతాయి. ఒక కోతి చనిపోతే సకల మర్కటాలూ ఏకమవుతాయి. జంతువులకున్న కనీస సలక్షణాలు కూడా మనకు లేకుండా పోతున్నాయో దీన్నేమనాలి?

నగరంలో మురికి మాలిన్యాలు పెరగడం వల్ల అంటువ్యాధి మహమ్మారిలా వ్యాపిస్తే, గాలిలోని వైరస్ ఆ ఇంటివారికి మాత్రమే సోకదు; అదే నగరంలో ఆరోగ్య సూత్రాలను స్వయంగా పాటిస్తూ ప్రతి రోజూ స్నానం చేస్తూ తన ఇంటిని ఇంటివారిని పరి శుభ్రంగా ఉంచుకునే వ్యక్తిని కూడా ప్రభావితం చేస్తాయి. మృత్యువాతన కూడా పడవచ్చు. ఈ నేపథ్యంలో విశ్వప్రభువు అల్లాహ్ చేసిన హెచ్చరిక మనందరికి కనువిప్పు కావాలి:
"ఆ ఉపద్రవానికి భయ పడండి. అది కేవలం మీలో దుర్మార్గులయిన వారిపైన మటుకే ప్రత్యేకంగా దాపురించదు". (సద్వర్తనులు సయితం దాని వాతన పడతారు. వారి గౌరవ మర్యాదలకు సయితం విఘాతం కలుగుతుంది.) (8:25) పోతే,

పిల్లల మనస్తత్వం రూపు దాల్చడంలో కన్న వారి పాత్ర చాల కీలకం అన్నది తెలిసిందే. పిల్లలపై బయటి పరిస్థితుల, చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం అధికంగానే ఉంటుంది. కాబట్టి ఇంట్లో అమ్మానాన్నలు పిల్లల ప్రవర్తనను ఓ కంట కనిపెట్టాలి.మంచీచెడులను వారి కర్థమయ్యేలా ఓపిగ్గా వివరించాలి. ముఖ్యంగా చెప్పడం వరకే పరిమితం అవ్వక చేతలకు సయితం పని కల్పించాలి.మాఅబ్బాయి చాలా మంచివాడు, మా అమ్మాయి చాలా ఉత్తములు అంటూ సంబరపడిపోతే సరిపోదు.

ఇది పాత కాలపు మాటగా అన్పించవచ్చు. కానీ, ఇదే వాస్తవం. ఎవరయినాసరే, కుటుంబంగానీ, సమాజంగాని వారికిచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేయకూడదు. స్వేచ్ఛ పేరుతో **'మేమెలాంటి దుస్తులైనా తొడుక్కుంటాము. ముందు మీ మగ చూపుల్ని మార్చుకోండి'** అన్న బరి తెగించిన మాటలు అసలే కూడదు. లాంగ్ డ్రైవ్‌కి, డేటింగ్‌కి వెళ్ళడం మిక్కిలి ప్రమాదకరం. ఆటోల్లో సయితం ఒంటరి ప్రయాణం మంచిది కాదు. ఆధునిక వస్త్రధారణ పేరుతో బిగుతైన దుస్తులు ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. జాగ్రత్త పడటం చాదస్తం కాదు. అప్రమత్తత అని గ్రహించాలి.

మూడవ సూత్రం: మంచిని ఆదేశించాలి. చెడును నిరోధించాలి.

"మీలో మంచి వైపుకు పిలిచేవారూ, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ, చెడు నుండి వారించే వారూ కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యం పొందుతారు." అని విశ్వకర్త ఉపదేశిస్తున్నాడు కాబట్టి, మనలో ఒక వర్గం ఉండాలి. అది వివేచన, విజ్ఞతల ఉత్తమ ఉపదేశం ద్వారా యువత శీలనిర్మాణం కోసం అలుపెరగని కృషి చేస్తూ ఉండాలి.

మానవతా ప్రేమికులు,మానవతా సానుభూతిపరులు జాతి స్త్రీలను కామాంధుల పంజా నుండి విమోచనం కలిగించి, వారు ఆనందంగా సురక్షితంగా, గౌరవంగా జీవించడానికి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పనంత వరకు సంతృప్తి చెందరు. విషపూరితమైన అవయవాన్ని తొలగించి ఒక ప్రాణాన్ని కాపాడినట్లు కామాంధులను, కల్లోల జనకుల్ని అంతమొందించి **'స్త్రీ'**కి రక్షణ కల్పించడానికి మానవతా ప్రేమికులు ముందుకు రావాలి. ఈ విషయంలో జాప్యం వహించేవారిని అల్లాహ్ ఇలా నిలదీస్తున్నాడు:
"మీకేమయింది? 'మా ప్రభూ! దుర్మార్గుల ఈ పురము నుండి మాకు విముక్తి నొసగు. మా కొరకు నీవద్ద నుండి ఒక సహాయకుణ్ణి నియమించు, మాకు (అండగా) నీవద్ద నుంచి ఒక సహాయకుణ్ణి పంపించు' అని వేడుకుంటున్న బలహీన పురుషులు, స్త్రీలు, పసివాళ్ళ విమోచనకై మీరు అల్లాహ్ మార్గంలో ఎందుకు పోరాడటం లేదు?!" (అన్‌నిసా: 75)

TELGFEBR13FINAL.indd 5 2/5/13 4:29 PM



ఖుర్‌ఆన్ మహిళా సాధికారత

వీరి విపరీత సాహిత్యం, అనైతిక రచనలు స్త్రీని నైతిక పతనానికై ప్రోత్సహించాయి. విచిత్రంగా ఈ రెండు వ్యవస్థలు కూడా స్వేచ్ఛ విముక్తి లాంటి అందమైన పద బంధాలు వాడటం ద్వారా స్త్రీని కుటుంబం నుండి బలవంతంగా బయటికి లాగే ప్రయత్నం చేశాయి.

కోటలు దాటని వీరి మాటలు ఎలాంటివంటే, ఆరిపోయే ముందు అదరగొట్టి వెలిగే దీప దశను సూచించేవే.

మా నవ సమాజపు సూక్ష్మ రూపమే కుటుంబం!ఈ కుటుంబ వ్యవస్థ, అందులోని సభ్యుల మానసిక స్థితి, వారి స్థానాలు సహజంగానూ, ఆరోగ్యవంతంగానూ వుంటేనే సమాజం ఆరోగ్యవంతంగా వుంటుంది. సమాజ నిర్వహణకు, సమాజ సభ్యుల మధ్య పని విభజన ఎంత అవసరమో... కుటుంబంలోనూ పని విభజన అంతే అవసరం. అప్పుడే ఇటు కుటుంబం, అటు సమాజంలోని కార్యాలు సవ్యంగా, సహజంగా, సుందరంగా, సశాస్త్రీయంగా నెరవేరు తాయి. పని విభజన అనేది కేవలం ఆర్థిక పరమైన పరిభాష కాదు. అది బాధ్యతాయుతమైన సంక్షేమకర పరిభాష కూడా. స్త్రీ,పురుషులిరువురూ వారి వారి శారీరక, మానసిక, ప్రాకృతిక మరియు సహజసిద్ధమైన భిన్నత్వాల మూలంగా వారివారి కార్యక్షేత్రాలు విభిన్నంగా, ప్రత్యేకంగా వుండక తప్పదు. ప్రకృతిని, అందులోని జంతుజాలాలను, వాటి మధ్యనున్న వైవిధ్యాలను పరిశీలిస్తే... ఈ విషయమే మనకు స్పష్టంగా అర్థమవుతుంది.

తల్లి స్థానం

ఆరోగ్యకరమైన సమాజానికి–ఆరోగ్యకరమైన మానసిక, తాత్విక చింతనలు కలిగిన మనుషులు అవసరమవుతారు. ఇటువంటి మానవులు ఆకాశం నుండి ఊడిపడరు. నేల నుండి పుట్టుకు రారు. ఏఫ్యాక్టరీలోనూ తయారు కారు. వారు తల్లి గర్భం నుండి జన్మిస్తారు. అమ్మ ఒడిని మొదటి బడిగా వారు జన్మతః పొందుతారు. మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా, శిక్షకురాలిగా వారు తమ తల్లిని సహజసిద్ధంగా పొందుతారు. ఉపాధ్యాయురాలి బాధ్యతను నిర్వర్తించడం–శిక్షకురాలి కర్తవ్యాన్ని నిర్వహించడం తల్లి యొక్క మొట్టమొదటి బాధ్యతగా ఉంటుంది. తన తల్లి ద్వారా శిక్షణ పొందడం బిడ్డ యొక్క జన్మ హక్కుగా కూడా వుంటుంది. ప్రకృతిలో సంఘ జీవనం గల జంతుజాలాన్ని గమనిస్తే ఈ సత్యమే ప్రస్ఫుటంగా మనకుగోచరిస్తుంది.

మహిళా స్థాయి

నేటి ఆధునిక ప్రపంచంలో స్త్రీ సమానత్వం, సాధికారత పేరుతో స్త్రీ విముక్తి మహిళావాదం తదితర ఇజాల పేర్లతోనూ మహిళను తన సహజ స్థానం నుండి దిగజార్చే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇంటిని వదిలి బయటకు రాకుండా స్త్రీ విముక్తి లేక సాధికారత సాధ్యం కాదని నేటి మహిళా సంఘాల తమ ప్రచార హోరుల ద్వారా మహిళా సమాజాన్ని ఉత్తేజ పరుస్తున్నాయి. ఈ ప్రచార ప్రభావంలో స్త్రీలు ఇరుక్కోవడం, పురుషులకు కూడా ప్రయోజనకారిగా వుండటంతో వీరు కూడా వంత పాడటం మొదలెట్టారు. ఇంటిలో పిల్లల పోషణ, శిక్షణ, గృహ నిర్వహణతోపాటు ఆమె డబ్బు సంపాదించే యంత్రంగా మార్చడం తనకు అన్ని విధాలా లాభదాయకమని పురుషుడు భావించి స్త్రీ తన సహజమైన స్థానాన్ని వీడిపోయేందుకు సహకరిస్తున్నాడు.నేటి కుటుంబ వ్యవస్థ బీటలువారడానికి ప్రధాన కారణం ఇదే.

స్త్రీకి సహజ ఆభరణాలయిన బిడియం, నాజూకుతనం, ఓర్పు, ప్రేమ, మాతృత్వపు మాధుర్యాలతోపాటు ప్రత్యేక శరీర ఆకృతి ఆమె సొంతం. సంతానానికి శిక్షణ, బాధ్యతల నిర్వహణ వంటి సహజ వరాల నుండి ఆమెను దూరం చేసి మోయ లేని భారాన్ని ఆమెపై రుద్ది మగువను మానసిక వత్తిడికి, ఆందోళనకు గురి చేస్తున్నారు.

ఆకర్షణీయ వంచన

నేటి ఆధునిక సిద్ధాంతాలు స్త్రీని అత్యంత అశ్లీలంగా మార్చేస్తున్నాయి. ఉనికిలో ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ స్త్రీని ఫ్యాషన్ పెరేడ్‌లకు, వ్యాపారప్రకటనలకు ఉపయోగపడే అందమైన వస్తువుగా భావించింది. పెట్టుబడీదారి వ్యవస్థలో సర్వం వ్యాపారమయమే. ఇక్కడ స్త్రీ అంగాంగాలు వ్యాపార వస్తువులుగా వాడుతుంటారు. ఒక గౌరవనీయమైన మహిళ తన శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చుకునేలా మానసిక తర్ఫీదు ఇక్కడ ఇస్తారు. **'నా శరీరం నా ఇష్టం'** లైంగిక స్వేచ్ఛలాంటి భావనలను ఆమె మెదడులో గుదిగుచ్చడానికి స్త్రీవాద సంఘాల ద్వారా అంతర్జాతీయ స్థాయి నుండి ప్రాంతీయ స్థాయి వరకు చర్చిస్తారు. సైద్ధాంతిక వ్యాసాలు హృద్యంగా రాయబడతాయి. ఫలితంగా స్త్రీ తన శరీరాన్ని ఇష్టపూర్వకంగా మార్కెట్‌లో ప్రదర్శనా వస్తువుగా, విక్రయ వస్తువుగా, మార్చుకుంటోంది. ఇందుకుగాను

TELGFEBR13FINAL.indd 6 2/5/13 4:30 PM

మల్టీ నేషనల్ కంపెనీలు, సినీ తారలు, క్రీడా కారులు, రాజకీయ బేహారులు అందరూ సహ కరిస్తారు. స్త్రీని నైతిక పతనం వైపునకు దిగ జార్చడానికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఉనికిలోకి వచ్చిన సోషలిస్టు వ్యవస్థ **"కొల్యం తొవ్"** లాంటి మహిళా సాహితీకారులను సృష్టించింది. వీరి విపరీత సాహిత్యం, అనైతిక రచనలు స్త్రీని నైతిక పతనానికై ప్రోత్సహిం చాయి. విచిత్రంగా ఈ రెండు వ్యవస్థలు కూడా **"స్వేచ్ఛ"**, విముక్తి లాంటి అందమైన పద బంధాలు వాడటం ద్వారా స్త్రీని కుటుం బం నుండి బలవంతంగా బయటికి లాగే ప్రయత్నం చేశాయి. సోషలిస్టు సిద్ధాంతకర్తలు ఏకంగా వ్యక్తిగత ఆస్తికి మూలం కుటుంబం కనుక కుటుంబాన్ని రద్దు చేయడం ద్వారా మాత్రమే వ్యక్తిగత ఆస్తిని రద్దు చేయొచ్చని సిద్ధాంతీకరించారు. అంటే.. కుటుంబం ధ్వం సం అయిన తర్వాత లైంగిక అవసరాలు కోరు కున్న వారితో కోరుకున్న విధంగా తీర్చు కోవచ్చు. వివాహ బంధమనేది గత కాలపు పనికిమాలిన బంధంగా, వెనుకబాటుతనానికి నిదర్శనంగా మిగిలిపోతుంది. **"పిల్లల శిక్షణ"** అనే అత్యంత కీలకమైన కర్తవ్యం నుండి తల్లి ని తొలగిస్తారు. దానికి బదులుగా **"టెక్నికల్ కేర్ టేకర్స్"** ఉనికిలోకి వస్తారు. వారు పిల్లల పెంపకాన్ని అత్యంత సాంకేతికంగా చేస్తారు. ఉత్పత్తి సాధనాలు, సమాజ పరమైనట్లుగానే సమాజ ఉమ్మడి ఆస్తి అయిన ఈ పిల్లలు కూడా సమాజ పరం అవుతారు. మమకారం, వాత్సల్యం, మృదుత్వం, మానవత్వం భావోద్వే గాలు అన్ని కూడా వర్గ కసికి బలైపోతాయి. రాజ్యాంగపు దుడ్డుకర్రను కుటుంబ వ్యవస్థను రద్దుచేయడానికి ఉపయోగించిన తర్వాత సోష లిస్టు వ్యవస్థ దానిని దూరంగా విసిరివేస్తుంది.

భవిష్యత్తు భయానకం

ఈ అమానవీయ భౌతిక పరిస్థితుల నుండి ఉద్భవించే సమాజంలోని మానవులు వారి మానసిక స్థితి ఎలా రూపొందుతుంది? వావి వరుసలు కనుమరుగైన సమాజపు జుగుప్సా కర సంఘటనలు అమెరికా, యూరప్‌లతో పాటు అనేక దేశాలలో దర్శనమిస్తున్నాయి. ఆ సమాజాలలో అశాంతి, అసహనం రోజు రోజుకూ పెరుగుతోంది. హత్యలు, ఆత్మహత్య ల శాతం పెరుగుతోంది. తల్లి కుమారుల మధ్య, తండ్రి కుమార్తెల మధ్య,సొంత సోదర సోదరీమణుల మధ్య లైంగిక సంబంధాలు పెరిగి పోతున్నాయి. స్వలింగ సంపర్కాలు సైద్ధాంతిక రూపం దాలుస్తున్నాయి. వ్యభిచా రం గౌరవ వృత్తిగా మారిపోయింది. సహ జీవనం పేరుతో వివాహ బంధం ఎగతాళికి గురౌతోంది. సింగిల్ మ్యాన్, సింగిల్ ఉమెన్ సంస్కృతి ప్రబలి పోతోంది. మరోవైపు ప్రకృతి కి విరుద్ధంగా మనిషి తన జీవన శైలిని తీర్చి దిద్దుకున్న ఫలితంగా మానసిక రోగాలు రెం డింతలయ్యాయి. బ్రెస్ట్ క్యాన్సర్లు 60 శాతం అభివృద్ధి చెందాయి. గర్భ సంచి క్యాన్సర్లు రెండింతలు నమోదౌతున్నాయి. అభంశుభం తెలియని పసిపిల్లలు కూడా ఎయిడ్స్ మహ మ్మారికి బలవుతున్నారు. ఈ భయానక పరిస్థి తికి మన భారత దేశం మరెంతో దూరంలో లేదు. సభ్యత, సంస్కృతులకు, నైతిక విలువల కు కాణాచి అయిన మన సుందర భారతావని రూపు రేఖలు అత్యంత వికృతంగా మారబోతు న్నాయి.దీనికి కారణం సృష్టికర్త అయిన దైవం మానవ సౌఖ్యం, సంక్షేమం కోసం ఏర్పరిచిన సహజ సిద్ధమైన సులభమైన హద్దులను మీర టమే.

దివ్యఖుర్‌ఆన్ దృష్టిలో మహిళా స్థాయి

స్త్రీ మహోన్నత బాధ్యత అయిన మాతృత్వం, పిల్లల శిక్షణ, కుటుంబ పరిరక్షణ, ఆమె నైజా నికి సరిపోయేవి కనుక ఆ బాధ్యతలు మాత్రమే దైవగ్రంథం దివ్యఖుర్‌ఆన్ ఆమెకు అప్పగించింది. ఈ మహోన్నత కృషికిగాను ఆమెకు మగ వానికంటే మూడు రెట్లు సేవలు పొందే గౌరవం ప్రసాదించింది. ఆమె పాదాల కింద ఏకంగా స్వర్గాన్ని ఉంచింది. ఇస్లాంలో సంపాదించడమైనా, ఖర్చు చేయడమైనా, దైవాదేశాలకు అనుగుణంగా వుండాలి. ఒక ముస్లిం పురుషుడు, స్త్రీపై ఆర్థిక ఆధిపత్యం వహించడం సాధ్యమే కాదు. స్త్రీకి ఆస్తిలో వారసత్వపు భాగం ఇవ్వబడింది. భర్త, తండ్రి, తల్లి, బిడ్డల సోదరుల ఆస్తులలో భాగ స్వామ్యం ఆమెకుంది. వ్యాపార లావాదేవీలు నిర్వహించే స్వేచ్ఛ హద్దులకు లోబడి ఇవ్వ బడింది. విద్యా, జ్ఞానాలను ఆర్జించడం ఆమె కు విధిగా చేయబడింది. ఇదంతా 1430 సంవత్సరాల క్రితమే అరబ్ ప్రాంతపు మహిళ పొందిన హక్కులని గుర్తించాలి. నేటి మహిళ కూడా ఇస్లాం ఛాయల్లో ఈ సాధికరతను సాధించుకోవచ్చు.

ఖుర్‌ఆన్ - మహిళ

1) **"ఆయన మిమ్మల్ని (స్త్రీ పురుషులను) ఒకే ప్రాణి నుండి పుట్టించాడు."** (ఖుర్‌ఆన్-4:1)

2) "పురుషులకు మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా పురుషులపై వున్నాయి." (ఖుర్‌ఆన్-2:228)

3) **"తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది."** (ఖుర్‌ఆన్-4: 7)

4) **"మీ కొరకు (స్త్రీ పురుషులిరువురికీ) సమ న్యాయం నిర్ణయించడం జరిగింది."** (ఖుర్‌ఆన్-2: 178)

5) "మీ స్త్రీలు మీకు దుస్తులు. మీరు వారికై దుస్తులు".(ఖుర్‌ఆన్-2:187)

6) **"తల్లి బలహీనతపై బలహీనతను సహించి కడుపున మోసింది.. రెండేళ్ళు పాలు తాగించింది."** (ఖుర్‌ఆన్-31: 14)

7) "విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరు లు, వారు మేలు చెయ్యండని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజ్ ను స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్తల పట్ల విధే యత పాటి స్తారు.... విశ్వాసులైన ఈ పురుషులకూ, స్త్రీలకు అల్లాహ్ వాగ్దానం చేశాడు, క్రింద కాలువలు ప్రవహించే తోటలను వారి కి ఇస్తాను అని. వారు వాటిలో శాశ్వతంగా ఉం టారు. నిత్యమూ కళకళలాడే ఆ ఉద్యాన వనాలలో వారి కొరకు పరిశుద్ధమైన నివాసా లుంటాయి." (ఖుర్‌ఆన్ 9:71,72)

8) **"ఎవరైనా సౌశీల్యవతులైన స్త్రీలపై నింద మోపి నలుగురు సాక్షులను తీసుకురాకపోతే వారిని ఎనభై కొరడా దెబ్బలతో కొట్టండి. వారి సాక్ష్యాన్ని ఇక ఎన్నడూ అంగీకరించ కండి".** (ఖుర్‌ఆన్ 24 : 4)■

(సందేశ విభాగం, జమాఅతె ఇస్లామీ హింద్ - ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా)

TELGFEBR13FINAL.indd 7 2/5/13 4:30 PM



ఆరోగ్యం పరిరక్షణ 2

- అబుల్ ఇర్ఫాన్

4) ఆరోగ్యం గురించి దైవప్రవక్త (స) వారి దుఆలు

"అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుకల్ ఆఫియత ఫిద్దున్యా వల్ ఆఖిరతి" – ఓ అల్లాహ్! ఇహపరలోకాల్లో నన్ను ఆరోగ్యంగా క్షేమంగా ఉంచమని నిన్ను వేడుకుంటున్నాను.

"అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుక సిహ్హతన్ ఫీ ఈమానిన్ వ ఈమానిన్ ఫీ హుస్‌ని ఖులుఖిన్ వ నజాహన్ యత్‌బవుహు ఫలాహున్ వ రహ్మతున్ మిన్‌క వ ఆఫియతన్ వ మగ్‌ఫిరతన్ మిన్‌క వ రిజ్వానా".

(ముస్తద్రక్ హాకిమ్)

ఓ అల్లాహ్! విశ్వాసంతోపాటు క్షేమాన్ని, సత్ప్రవర్తనతోపాటు విశ్వాసాన్ని, సాఫల్యం మరియు నీ కారుణ్యంతో కూడిన విజయాన్ని, శ్రేయాన్ని, క్షమాభిక్షను, ప్రసన్నతను నీ నుండి కోరుకుంటున్నాను.

ఈ దుఆల ద్వారా కరుణామయుడయిన అల్లాహ్ ప్రసాదించే శ్రేయోక్షేమాలు, ఆయురారోగ్యాలు ఎంతటి మహదానుగ్రహాలో బోధ పడుతోంది. దుఆ దైవసాన్నిధ్యంలో సంధించే ఓ ప్రశ్న. మరోవైపు ఇది దాసుని హృదయం నుంచి వెలువడే ఆవేదన.

5) ఆరోగ్యం, పరిశుభ్రతకు ఐదు విధానాలు

హజ్రత్ అబూ హురైరా (ర) కథనం ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి; **"ప్రకృతిసిద్ధమయిన అయిదు విధానాలున్నాయి–1) ఖితాన్ (వడుగు) చేయించడం. 2) నాభి క్రింది వెంట్రుకల్ని తీసివేయడం. 3) గోళ్లు కత్తిరించడం. 4) చంకల్లోని వెంట్రుకలు తీసివేయడం. 5) మీసాలు కత్తిరించటం".** (బుఖారీ, ముస్లిం)

పై పేర్కొనబడిన ఐదు పనుల్ని మానవాళికి ప్రకృతిసిద్ధమయిన పనులుగా పేర్కొనడం జరిగింది. వీటి ఆచరణ ప్రవక్త (స) సంప్రదాయం. దైవప్రవక్త (స) వీటిని నిర్వహించాలని తాకీదు చేశారు; విడిచి పెట్టడాన్ని గర్హించారు. దీన్ని బట్టి ఈ అయిదు పనుల్లో ఎంతటి ఆరోగ్యం, పరిశుభ్రత దాగి ఉందో తెలుస్తోంది.

1) ఖితాన్: ఇది దైవప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ద్వారా ముహమ్మద్ (స) అనుచర సముదాయానికి ఇవ్వబడిన సంప్రదాయం. ఈ సంప్రదాయం ద్వారా మనిషి మూత్ర వ్యాధులు, మూత్ర పిండాల వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చు. దీనిపై యావన్మంది వైద్యుల ఏకాభిప్రాయం ఉంది.

2) నాభి క్రింది వెంట్రుకల్ని తొలగించకపోతే శారీరకంగా అసౌకర్యం కలగడమే కాకుండా అపరిశుభ్రత కూడా ఏర్పడుతుంది. 3) గోళ్లు కత్తిరించడం ద్వారా శారీరక అందం ఒనగూడటమే కాదు, పరిశుభ్రతకు కూడా ఇది ఎంతో అవసరం. గోళ్లు కత్తిరించకపోతే, వాటిలో మట్టి, మలినాలు పేరుకు పోతాయి. 4) చంకల్లో వెంట్రుకలు తొలగించకపోతే అక్కడ అపరిశుభ్రత ఏర్పడుతుంది. మన ప్రక్కన కూర్చున్న వారికి దుర్వాసనతోపాటు అసహ్యం కలుగుతుంది. 5) పొడవైన మీసాలు కత్తిరించకపోతే వాటిలో పేరుకునే మలినాలు మనం త్రాగే పానీయంతో పాటు గొంతులోకి ప్రవేశిస్తాయి. దీన్ని బట్టి శుచీశుభ్రతల విషయంలో ఇస్లాం చూపిన పద్ధతి ఎంత ఉత్తమమయినదో బోధ పడుతుంది. (పంచకేశ–అయిదు చోట్ల వెంట్రుకలు జీవితాంతం తీయకూడదు అన్న అచారం ఎంత వ్యర్థమయినదో అర్థమవుతుంది). ఇస్లాం వంటి పరిశుద్ధ ధర్మాన్ని అల్లాహ్ మానవాళికి అందజేసినందుకు ఆయనకు వేనవేల కృతజ్ఞతలు చెల్లించుకోవాలనిపిస్తుంది.

TELGFEBR13FINAL.indd 8 2/5/13 4:30 PM



వాక్యూమ్ క్లీనర్ ఎలా పని చేస్తుంది?

నేడు ఇళ్ళు, మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేసుకోవడం చాలా తేలిక. వాక్యూమ్ క్లీనర్ క్లీనింగ్ ప్రోగ్రామ్‌ను చాలా సులువుగా చేస్తుంది. అసలు వాక్యూమ్ క్లీనర్ ఎలా పని చేస్తుంది. దుమ్ము, ధూళిని ఏ విధంగా పీల్చుకుంటుంది?

వాక్యూమ్ క్లీనర్ లోపల ఉన్న గాలిని బయటకు పంపించడం అనే ప్రక్రియ ద్వారా పని చేస్తుంది. లోపన ఉన్న గాలి పీడనంకన్నా వాతావరణ పీడనం ఎక్కువగా ఉంటుంది. ఈ రెండు పీడనాల మధ్య ఉన్న వ్యత్యాసం వలన బయట ఉన్న గాలి వేగంగా లోపలికి ప్రవేశిస్తుంది. ఈ విధంగా ప్రవేశించిన గాలి దాని మార్గంలో వచ్చే దుమ్ము దూళీలను కూడా తన వెంట తీసుకుని పోయి ముందు ఉన్న డస్ట్ బ్యాగ్‌లోకి ప్రవేశిస్తుంది. ఇదెలా సాధ్యమయింది? మనిషి ఈ ప్రక్రియను, పరికరాన్ని తయారు చేయడం కోసం దేన్ని చూసి స్ఫూర్తి పొందాడు అనే ప్రశ్న ఉదయించవచ్చు.

మన ఊపిరి తిత్తులు అచ్చం వాక్యూమ్ క్లీనర్ పని చేసిన విధంగానే పని చేస్తాయి. మనం లోపల గాలి పీల్చుకున్నప్పుడు ఊపిరి తిత్తులు వ్యాకోచం చెందుతాయి. దీని వలన శ్వాస కోశాల లోపల ఉన్న గాలి విస్తరించి ఎక్కువ స్థలం ఆక్రమిస్తుంది. శ్వాస కోశాల లోపల గాలి పీడనం తగ్గుతుంది. అప్పుడు ఊపిరి తిత్తులకు వెలుపల ఉన్న గాలి పీడనం ఎక్కువగా ఉంటుంది. దీంతో బయట ఉన్న గాలి వేగంగా లోపలికి ప్రవేశిస్తుంది. ఈ విధంగా బయటి గాలి లోపలికి వెళ్ళినప్పుడు మన ముక్కులో ఉన్న వెంట్రుకలు మనం పీల్చుకున్న గాలిలో ఉన్న దుమ్ము, ధూళిలను వడపోయడంతో స్వచ్ఛమైన గాలి మాత్రమే లోపలకు వెడుతుంది. చూశారా! ఏ శ్వాస ఆడటం మీద మన శ్వాస ఆధార పడి ఉందో ఆ శ్వాసను స్వచ్ఛమైనదిగా చేసేందుకు పరమోన్నతుడయిన అల్లాహ్ ఎలాంటి ఏర్పాటు చేశాడో!! ఇటువంటి ఏర్పాట్లు మన శరీరంలో కోకొల్లలు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"మీరు అల్లాహ్ చేసిన మేళ్ళను లెక్కించదలచినా లెక్కించలేరు. నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు, మేలును మరిచేవాడు".** (ఇబ్రాహీమ్: 34)

కాబట్టి వాక్యూమ్ క్లీనర్‌ను తయారు చేసిన వ్యక్తిని తలచుకుని కీర్తించే మనం అటువంటి అనన్య అనుగ్రహాల్ని మనం అడగకుండానే మనకు ప్రసాదించిన ఆ పరమ దయాళువు అయిన అల్లాహ్‌ను ఎంతగా కీర్తించాలో, ఎంతగా అయనకు కృతజ్ఞత చూపాలో ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకోవాలి! ఆ ఊపిరితిత్తులను ధూమ పానంతో కలుషితం చేసి పాడు చేసుకోకుండా కాపాడుకోవాలి!!

ఆకాశం ఎందుకు నీలంగా ఉంటుంది?

సప్తరంగుల హరివిల్లుతో అప్పుడప్పుడూ అందంగా ఆకర్షణీయంగా దర్శనమిచ్చే ఆకాశం నీలం రంగులోనే ఎందుకు ఉంటుంది? దీనికి కారణం ఏమయినా ఉందా? అంటే, ఉంది. కాంతి వెదజల్లినట్టు ఉండటం (లేదా ప్రతిఫలించడం అని కుడా అనవచ్చు) అనేది కాంతి తరంగ దైర్ఘ్యం మీద ఆధార పడి ఉంటుంది. ఎక్కువ తరంగదైర్ఘ్యం కలిగి ఉన్న కాంతి తరంగాలు తక్కువగా ప్రతిఫలిస్తాయి. అదే తక్కువ తరంగదైర్ఘ్యం కలిగి ఉన్న కాంతి తరంగాలు ఎక్కువ ప్రతిఫలిస్తాయి. నీలం రంగు కాంతి తరంగదైర్ఘ్యం తక్కువ. కాబట్టి నీలం రంగు కాంతి ఎక్కువగా ప్రతిఫలిస్తుంది. దీని వలన ఆకాశం నీలం రంగులో కన్పిస్తుంది.ఇక్కడో అనుమానం కలగవచ్చు. ఊదా రంగు కాంతి తరంగదైర్ఘ్యం కూడా తక్కువే కదా! ఆ విధంగా చూస్తే ఊదా రంగు కాంతి తరంగాలు కూడా ఎక్కువగా ప్రతిఫలిస్తాయి కదా! అలాంటప్పుడు ఆకాశం ఊదా రంగులో ఎందుకు కన్పించదు?

వాతావరణ పొరల్లోకి తెలుపు రంగు కాంతి ప్రవేశించగానే వాతావరణంలో ఉన్న లక్షల కొద్ది దుమ్ముధూళి కణాలు నీటి బిందువుల కారణంగా కాంతి అన్ని దిశలను ప్రతిఫలిస్తుంది. దీనినే కాంతి వెదజల్లడం లేదా కాంతి విరాజిల్లడం (స్కాటరింగ్) అంటారు.

తెలుపు రంగు కాంతిలో సప్త వర్ణాలు ఉంటాయి. ఇందులో ఉన్న ఏడు రంగులకు ఏడు రకాలు తరంగదైర్ఘ్యాలు ఉంటాయి. సప్త వర్ణాల్లో అన్నింటికన్నా తక్కువ తరంగదైర్ఘ్యం కలిగి ఉన్న వర్ణం నీలం. అందు వల్లనే నీలం రంగు మిగిలిన రంగులకన్నా ఎక్కువగా ప్రతి ఫలించే గుణం కలిగి ఉంటుంది.

ఊదా రంగు కూడా తక్కువ తరంగదైర్ఘ్యం, ఎక్కువ ప్రతిఫలించే గుణం కలిగి ఉన్నా ఆకాశం ఊదా రంగులో కన్పించదు. ఎందువలనంటే మన కన్ను వర్ణపటంలో చివరనున్న ఊదా, ఇండిగో రంగులకన్నా నీలం రంగునే ఎక్కువగా చూడగలదు. ఇప్పుడు అర్థం అయ్యింది కదా! ఆకాశం నీలం రంగులో ఎందుకు ఉంటుందో?

ఇది అల్లాహ్ పనితనానికి, అపార శక్తి సామర్థ్యాలకు ప్రతీక. భూమ్యాకాశాల నిర్మాణంలో అల్లాహ్ అసాధారణమైన, అనితర సాధ్యమైన ప్రజ్ఞా పాటవాలను కనబరచడమే గాకుండా, అవి ఇటూ అటూ ఒరిగి పోకుండా స్థిర పరచి తన సృష్టికోటిపై మహోపకారం చేశాడు. ఇది నిస్సందేహంగా ఆయన దయాగుణానికి ఓ మచ్చు తునక. ఆయన గనక ఈ విషయంలో దయదలచకపోతే రెప్పపాటు సమయంలో విశ్వ వ్యవస్థ అంతా అతలాకుతలమైపోతుంది. ఇదే విషయాన్ని ఆయన ఖుర్‌ఆన్‌లో పేర్కొన్నాడు: **"యదార్థానికి అల్లాహ్ ఆకాశాలను, భూమిని వాటి స్థానాల నుంచి తొలిగి పోకుండా నిలిపి ఉంచాడు. అవి గనక తమ స్థానాల నుంచి తొలగిపోతే అల్లాహ్ తప్ప వాటిని నిలిపి ఉంచే వాడు కూడా ఎవడూ లేడు. నిశ్చయంగా ఆయన సహనశీలి, క్షమాశీలి".** (ఫాతిర్: 41)

"ఆయనే నింగిని నిలిపి ఉంచాడు. ఆయన అనుమతి లేనంత వరకూ అది నేలపై పడజాలదు". (అల్ హజ్జ్: 65) పోతే బ్రహ్మాండం సయితం బ్రద్ధలయ్యేంతటి మహాపరాధం ఏమిటో తెలుసా? అది కూడా ఆయన మాటల్లోనే వినండి! **'కరుణామయునికి (అల్లాహ్‌కు) సంతానం ఉందని వారు చేసే వాదన ఎట్టిదంటే, దాని మూలంగా ఆకాశం పగిలిపోయేందుకు, భూమి బ్రద్ధలైపోయేందుకు, పర్వతాలు తునాతునకలయి పోయేందుకు అస్కారం ఏర్పడింది".** (మర్యమ్: 90, 91)

TELGFEBR13FINAL.indd 9 2/5/13 4:30 PM



ఇస్లాం 2 చారిత్రక పాత్ర

అబుల్ హసన్

ఇస్లాం ధర్మం ఏ లక్ష్యంతోనయితే ప్రజలకు దీక్ష ఇచ్చిందో అది అప్పటికి విశ్వ వ్యాప్తంగా ఉన్న అపోహలకు, అపార్థాలకు, అపమార్గాలకు విరుద్ధమయినది. శబ్దోత్పత్తి ప్రకారం ఇస్లాం అనే పదానికి అర్థం - శాంతి, సుస్థిరత, సమర్పణ, విధేయత. దేవుని ఏకత్వానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఆయన ఆదేశాలకు తలొగ్గి జీవించడం. మానవ సేవా దృక్పథాన్ని దుర్మార్గంగా ప్రక్కత్రోవ పట్టించిన విగ్ర హారాధనను తిరస్కరిస్తూ, మానవ జాతి సమ్మేళనంతో సమ్మోహనాత్మకంగా పుడమి మొత్తం శాంతితో అలరారాలన్నది ఇస్లాం ప్రథమ లక్ష్యం. ప్రవక్త ముహమ్మద్ (స) వారి అనుచరులు తౌహీద్ ఆధారంగానే స్వదేశంలో శాంతి నెలకొ ల్పారు. తర్వాతి తరం వారు అదే తౌహీద్ పునాదిగా సమర్ఖన్డ్ నుండి స్పెయిన్ వరకు గల విశాలమయిన రాజ్యాలలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పారు.

ఖలీఫా ఉమర్ (ర) జెరూసలెమ్‌ను జయించినప్పుడు అక్కడి ప్రజల సంపదను కొల్లగొట్ట లేదు. వారి దైవారాధనకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వ బడింది. క్రైస్తవులకు ప్రత్యేక నివాసాలు ఏర్పాటు చేశారు. క్రిస్టియన్, ముస్లిం, అదే విధంగా సమకాలీన ఆధునిక కాలాలకు చెందిన ప్రామాణిక చరిత్రకారులందరిని సంపూర్ణంగా అధ్యాయనం చేసిన పిమ్మట గిబ్బన్ స్పష్టంగా ఒక విషయం రుజువు చేశాడు. **'ముహమ్మద్ (స) ప్రవక్త తన క్రిస్టియన్ సోదరులకు వెంటనే భద్రత కల్పించాడు. స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించారు. ఈ సత్య శీల విధానాన్ని ఖచ్చితంగా పాటించారు. ప్రవక్త (స) వారి వారసులే కాక, అరబిక్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలన్నింటిలో ఈ విధానాన్నే కొనసాగించారు. ఈ పరంపర తాతార్ చేతుల్లోకి ప్రభుత్వ పగ్గాలు వెళ్ళే వరకు కొనసాగింది. మొదటి తరం తుర్కిష్ సుల్తానుల కాలంలోకూడా సహనశీలమయినదిగా ఇస్లాం కున్న పేరు కొనసాగింది. మరి ముస్లింల సహనశీల పాలనకు పూర్తి భిన్నంగా విషాన్ని విరజిమ్మింది క్రూసేడుల (క్రైస్తవుల) ప్రవర్తన'.**

నాలుగు వంద అరవై ఏండ్ల అనంతరం క్రూసేడుల కారణంగా జెరూసలేమ్‌లో క్రైస్తవుల పాలన ఏర్పడింది. కాని గతించిన ముస్లింల సహనశీల పరిపాలనను తలచుకొని ప్రజలు విచారించారని గిబ్బన్ తన **'రైస్ అండ్ ఫాల్ ఆఫ్ ది రోమ్ ఎంపైర్'**లో పేర్కొన్నాడు. క్రూసేడులు సాగించిన దమన కాండ కారణంగా పెద్దా, చిన్నా, ఆడా, మగా తేడా లేకుండా మూడు రోజుల పాటు నిర్విఘ్నంగా,నిర్దయగా నిరంకుశంగా, నిర్లజ్జగా మారణ కాండ సాగింది. సుమారు 70 వేల మంది దారుణంగా వధించబడ్డారు.పాలస్తీనా వీధుల్లో నర రుధిరం ఏరులయి పారింది. యూదులను వారి గుడిసెలలో తగుల బెట్టారు. ఎంతో మందిని బంధీలుగా చేసుకున్నారు.

పోతే, దేవుడు ఒక్కడే అన్న భావనను ప్రాచీన జోరాస్టర్ మతం ప్రత్యేకంగా వ్యతిరేకించింది. మంచీచెడు అన్న ద్వంద్వ సూత్రం శాశ్వతమయినదిగా వారు భావించారు. ఈ పరిస్థితుల్లో కూడా ముస్లింలు మాజియన్ తెగలను గౌరవించారు. మూడవ దశాబ్ది కాలం నాటి వరకు అగ్ని మందిరాలు(TEMPLES OF FIRE)

TELGFEBR13FINAL.indd 10 2/5/13 4:30 PM

నిరాడంబరమయిన మస్జిదులతోపాటు వెలు గొందాయి. ఈ ప్రాచీన కట్టడాలు శిథిలమవ్వ డానికి ముస్లింలు కారణం కాదు.ఇస్లాం అద్వి తీయ ప్రబోధనాల ప్రభావంతో ప్రజలు పరివ ర్తనం చెంది విడిచి పెట్టడం వల్లనే అవి శిథి లావస్థకు చేరుకున్నాయి. ఆ విషయానికొస్తే, ఒక దేశ ప్రజలపై స్వల్ప ప్రతిఘటనతో విశ్వా సాలను రుద్దడం నిజంగా ఏ శక్తి వల్లా కుద రని పని. వాస్తవానికి అక్కడి విశ్వాసాలు క్షీణ దశకు చేరుకున్నాయి. నాగరిక ప్రజల అవస రాలను అవి ఏ మాత్రం తీర్చలేకపోయాయి. అగ్ని, సూర్యుల వెలుగులకి, ఖరీమన్ (KHARI MAN) ప్రతిభకు గ్రహణం పట్టింది. శాశ్వత మయిన పాప సూత్రం (PRINCIPLE OF EVIL) వారిని అంధకారంలో ఉంచింది. ఈ దయ నీయ స్థితిలో ఇస్లాం సందేశాన్ని ఫర్షియా ప్రజలు విముక్తి సాధనంగా స్వీకరించారు.

అలాగే ఉత్తర ఆఫ్రికాలో ఆలెగ్జాండ్రియా నుండి కారితేజ్ వరకు గల ఏకైక ప్రాంతంలో ఇస్లాం ప్రకాశించడం వల్ల, క్రిస్టియన్ మూఢ విశ్వాసాల కర్రి మబ్బులు తుడిచి పెట్టుకుపో యాయి. అక్కడ కాలం చెల్లిన విశ్వాసాల క్షీణత వల్ల ప్రజల్లో చోటు చేసుకున్న నిరాశ నిస్పృహ, అస్తవ్యస్థ పరిస్థితులు ఇస్లాం విప్లవా నికి ఊతంగా నిలిచాయి. అంతేగానీ, ప్రజల్లో కొత్త మతధర్మం పట్ల అసహనం ఎంత మాత్రం కానరాదు. డోవటస్టుల నాస్తిక భావ నలు, కాథలిక్ మతస్థుల ఆవేశం ప్రజల పాలిట శాపంగా పరిణమించాయి. దారిద్ర్యం లో మ్రగ్గుతున్న ప్రజలు చేసిన తిరుగుబాటు ను కాథలిక్ మతవ్యతిరేకమని భావించి అణచి వేశారు. అటువంటి గడ్డు స్థితిలో వన డాల్ (VANDAL) మూరిష్ (MOORISH) దండ యాత్రల కారణంగా అప్పటికే శిథిలమై ఉన్న వి పూర్తిగా సర్వ నాశనమయ్యాయి. అలజడి, నిరాశ జనక పరిస్థితిలోకి ప్రజలు నెట్టి వేయ బడ్డారు. ఫలితం–భ్రమలో లభించే స్వాంతన కోసం ప్రజలు సన్యాసులుగా మారారు. నిర ర్థక జీవన విధానాలను అవలంబించారు. సామాజిక అస్థిరత్వం, ఆధ్యాత్మిక నిరాశావాదం కలగలిపి సృష్టించిన గాఢాంధకారంలో, ముహమ్మద్ (స) అందించిన ఆశావాహ ఇస్లాం సందేశం నమ్మకం కలిగించే దీప కాంతిగా మెరిసింది.

ఇస్లాం ఉపదేశాలు కలిగించిన చైతన్యం ఎంతో మందిని ఆకర్షించింది. దేవుడు ముగ్గు రుగా ఉన్నారన్న (THREENITY) నమ్మకంలో మూఢంగా కూరుకుపోయిన వారిని ఇస్లాం నిద్ర లేపింది. ప్రకృతి అవసరాలను కూడా ఆరోగ్యకరమయిన రీతిలో తీర్చుకునే వెసులు బాటును, ప్రోత్సాహాన్ని ఇస్లాం వారిలో కలిగిం చింది. విషణ్ణ వదనంలో కూరుకుపోయిన ప్రజలకు ఇస్లాం ఒక కొత్త నమ్మకాన్ని కలి గించింది. ఈ సత్య తరంగాలు ఒక నూతన సమాజానికి నాంది పలికాయి. అందులో ప్రతి ఒక్కరికీ వారి దక్షత, ప్రతిభలను బట్టి పైకి ఎదిగే అవకాశం లభించింది. ఇస్లాం అందించిన సత్యస్ఫూర్తి, ముస్లిం పాలకుల ధర్మబద్ధ పాలన, సస్యశామలమయిన భూము లు, వీటితో వారి పనితనం కూడా తోడవ్వడం తో ఉత్తర ఆఫ్రికా ప్రజలు చాలా వేగంగా కోలుకొని సాఫల్యాన్ని, సౌభాగ్యాన్ని తమ సొంతం చేసుకున్నారు.

ఏకేశ్వర వాద మతంగా ఇస్లాం అరబ్ నాగరి కతతోపాటు స్వేచ్ఛాయుత తాత్విక సిద్ధాంతగా మధ్య యుగాల నాటి యూదులను, పరోక్షం గా పాశ్చాత్త క్రైస్తవులను చాలా శక్తివంతంగా ప్రభావితం చేసింది. పరిపూర్ణ ఏకేశ్వర వాద మతంగా ఇస్లాం పోషించిన పాత్ర అమోఘం. అంతకు పూర్వం ప్రవక్తలు తీసుకొచ్చిన జీవన విధానంలో సయితం తౌహీద్ కీలకమయిన అంశంగా ఉన్నప్పటికీ తర్వాత వారి అనుయా యుల నిర్లక్ష్యం వల్ల ప్రవక్తలు బోధించిన స్వచ్ఛమయిన ఏకేశ్వర వాదం ఇతర మిథ్యా వాదాలతో ప్రభావితం అయి, తన ఉనికిని కోల్పోయింది. అయితే ఇస్లాం విషయంలో అలా జరుగలేదు. అందులో మిథ్యాభావాలను జొప్పించే ప్రయత్నం జరిగినప్పటికీ, అక్కడ క్కడ కొన్ని ప్రాంతాల్లో ఇస్లాం ధర్మ అవగా హనా రాహిత్యం వల్ల కొందరిలో బహుదైవ భావాలు పొడ సూపినప్పటికీ నేటికీ స్వచ్ఛమ యిన ఏకేశ్వరోపాసనకు కట్టుబడి జీవిస్తున్న ప్రజల సంఖ్య కోట్లకు పైమాటే. కారణం – ఇస్లాం ఖుర్ఆన్ మరియు హదీసులు సురక్షి తంగా ఉండటమే. వ్యక్తి పూజను ఇస్లాం సదా వ్యతిరేకించిన మాట ధర్మవేత్తల, ఔలియాల వియంలోనే కాదు, సత్య ప్రవక్త అయిన ముహమ్మద్ (స) వారి విషయంలోనూ అది అదే నియతికి, నియమానికి కట్టుబడింది.

"సామాజిక అస్థిరత్వం, ఆధ్యాత్మిక నిరాశావాదం కలగలిపి సృష్టించిన గాఢాంధకారంలో, ముహమ్మద్ (స) అందించిన ఆశావాహ ఇస్లాం సందేశం నమ్మకం కలిగించే దీప కాంతిగా మెరిసింది."

అందుకు క్రింది ఉదాహరణ ప్రబల తార్కాణం.

హజ్రత్ ఉమర్ (ర) గారికి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి మరణవార్త అందగానే – తీవ్ర భావోద్రేకానికి లోనై ఆయన ఆ వార్త ను నిరాకరించారు. అలా చెప్పిన వారిని హత మారుస్తానని అన్నారు. అప్పుడు హజ్రత్ అబూ బకర్ (ర) ఉమర్ (ర) ఉద్రేకాన్ని చల్లార్చుతూ అన్న మాటలివి:

"సోదరులారా! వినండి. ఒకవేళ ఎవరయినా ముహమ్మద్ (స)ను ఆరాధిస్తుంటే ఆయన (స) ఇహలోకం వీడిపోయారని తెలుసుకో వాలి. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించే వారికి అల్లాహ్ సజీవంగా ఉన్న సంగతి తెలిసిందే. నిత్య జీవుడు అల్లాహ్ మాత్రమే" అంటూ ఖుర్ఆన్ వాక్యాన్ని చదివి విన్పించారు.

"ముహమ్మద్ (స) దైవప్రవక్త మాత్రమే. అతని కి పూర్వం కూడా అనేక మంది దైవప్రవక్తలు వచ్చి పోయారు. మరి ఆయన చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మం నుండి) వెనుదిరిగి పోతారా ఏంటీ? గుర్తుంచుకోండి! అలా వెను దిరిగి పోయేవాడు అల్లాహ్‌కు ఎలాంటి నష్టం కలిగించలేడు. అల్లాహ్ తనకు కృతజ్ఞతలు చూపేవారికి తగిన బహుమానం ప్రసాది స్తాడు". (ఖుర్ఆన్–3: 144)

ఇక్కడో విషయం గుర్తించాలి. ఇస్లాం తొలి దళపతి ముహమ్మద్ (స)ను ఒక దైవ ప్రవక్తగా మాత్రమే పిలిచారు కానీ, ఒక దైవంగా తలచ లేదు. ప్రవక్త (స) వారి అనుసరులు సయితం ఆయన్ను ఒక దైవప్రవక్తగా మాత్రమే చూశారు. అలా దైవ అంతిమ ప్రవక్తకు లేని దైవత్వాన్ని ఆపాదించకుండా ఆయన్ను కేవలం దైవ సందేశహరునిగా మాత్రమే చూడటం ఇస్లాంను పరిశుద్ధ ఏకేశ్వర వాద సిద్ధాంతంగా నిలబెట్టింది. ఎందుకంటే,.....

(ఇంకా ఉంది)

TELGFEBR13FINAL.indd 11 2/5/13 4:30 PM



ముస్లిమేతరుల వరకు మానవ మహోపకారి ముహమ్మద్ (స) వారి సందేశాన్ని చేరవేయాలన్న శుభ సంకల్పం.

ఐపిసి సహకారంతో ఐఎమ్ఎ ఆధ్వర్యంలో **'మానవ మహోపకారి ముహమ్మద్ (స)'** అన్న బేనర్ క్రింద ఓ ప్రచార కార్యక్రమాన్ని రూపు దిద్దడం జరిగింది. గౌరవనీయులైన మౌలానా తాహిర్ మదనీ గారు మరియు ఇండియా వెల్ఫేర్ పార్టీ అధ్యక్షులు శ్రీ ముజ్తబా ఫారూఖ్ గారి చేతుల మీదుగా వివిధ భాషల్లో మానవ మహోపకారి ముహమ్మద్ (స) వారిని పరిచయం చేసే కర పత్రాన్ని ఆవిష్కరించి ఈ బృహత్కార్యాన్ని జనవరి 24వ తేదీ గురువారం జమియ్యతుల్ ఇస్లామ్ అల్ ఇజ్తిమాయీ హాలులో శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ సందర్భంగా కన్వినర్‌గా వ్యవహరించిన సోదరులు శ్రీ అర్షద్ హబీబ్ గారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాత్విక ప్రవచనాల్ని కువైట్‌లో నివసించే లక్ష మంది ముస్లిమేతరుల వరకు చేరవేయాన్నది మా ధ్యేయమని పేర్కొన్నారు. అలాగే ప్రవక్త (స) వారికి సంబంధించి ఆన్‌లైన్ పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం దైవచిత్తమయితే 24 ఫిబ్రవరిన ముగుస్తుందన్నారు.

వివరాలకు సంప్రదించండి: 60018869, 97357360

ఐపిసి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు

ఐపిసి సిటీ బ్రాంచీ ఆధ్వర్యంలో 18-01-2013 తేదీన హసావీ ప్రాంతంలో తెలుగు సోదరుల కోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సోదరులు జనాబ్ నజీబుద్దీన్ గారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు ప్రసంగిస్తూ, **'మంచిని పెంచడం, చెడుని తుంచడం'** గురించి నొక్కి వక్కాణించారు. సమాజంలో మార్పు రావాలంటే చెడును చూసి దాటి పోకుండా **'ఐ కేర్...ఐ రియాక్ట్'** అనే భావం మనలోని ప్రతి ఒక్కరిలో చోటు చేసుకున్నప్పుడు అధర్మం అంతమయి ధర్మం నాలుగు పాదాల నర్తించగలదన్నారు. తర్వాత ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో ఈ ప్రోగ్రామ్ ఘనంగా ముగిసింది.

అలాగే జనవరి 26వ తేది శనివారం ఉదయం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కువైట్‌లోని దౌత్య కార్యాలయాన్ని సందర్శించకున్నారు తెలుగు సోదరులు. ఈ సందర్భంగా గణతంత్ర సంబరాల్లో పాల్గొనడంతోపాటు నెలవంక మాసపత్రికను అక్కడికి విచ్చేసిన తెలుగు వీరాభినులకు అందజేసి, మిఠాయి పంచి శుభాకాంక్షలు తెలియజేశారు.

TELGFEBR13FINAL.indd 12 2/5/13 4:30 PM



ప్రవక్త (స) ప్రవచనం

అల్లాహ్ వచనాలు
ప్రవక్త ప్రవచనాలు
అల్లాహ్ సామర్థ్యాలు
ప్రవక్త స్తోత్రాలు
అల్లాహ్ శాసనాలు
ప్రవక్త భాష్యాలు
అల్లాహ్ ఆదేశాలు
ప్రవక్త ఆదర్శాలు

'వమా యన్‌తిఖు అనిల్ హవా' వలె (అతను తన మనో వాంఛలకు లోబడి మాట్లాడడు)
'ఇన్ హువ ఇల్లా వహ్‌యున్ యూహా' వలె (అతను మాట్లాడేదంతా అతని వద్దకు పంపబడే దైవవాణి తప్ప మరేమీ కాదు)
మానవాళి పాలిట నిత్య వరాలు
మార్గనిర్దేశానికి ప్రత్యక్ష సూత్రాలు
పచ్చని ప్రగతికి ప్రతిరూపాలు
సుందర వనాలు సుమధుర ఫలాలు
నిత్య సుఖాలు శాశ్వత స్వర్గాలు
శాంతి గీతాలు దైవ దర్శనాలు

మనిషి మహా ఆత్రగాడు

మనిషి మహా ఆత్రగాడు
తాడోపేడో తేలిపోవాలంటాడు

కోరికో కామమో
ఎలాగయినా తీరిపోవాలి
ధనమో ఇంధనమో
ఎలాగోలా వచ్చి పడాలి
సర్గమో రకమో
ఇక్కడే అనుభవించాలి
"మనిషి మహా...."

చెడో చీకటో
ఏదొకటి కావాలి
కత్తో సుత్తో
ఏదొకటి పట్టాలి
హత్యో హోమమో
ఏదొకటి చేయాలి
"మనిషి మహా...."

అసత్యమో అధర్మమమో
దేన్నోకటి పాటించాలి
కోపమో ద్వేషమో
దేన్నోకటి ప్రదర్శించాలి
రచ్చో చిచ్చో
దేన్నోకటి రగలించాలి
"మనిషి మహా...."

అపశృతో అపశుభమో
ఏదోకటి వాగాలి
కట్నమో కాష్టమో
ఏదోకటి తేలాలి
సారాయో జూదమో
ఏదోకటి కావాలి
"మనిషి మహా...."

అలా కాక–
మనో తుచ్ఛవాంఛల దాస్యం మాని
మాధవుడు చూపిన బాటన నడిస్తే
లక్షల్ని కాదు లక్ష్యాల్ని సాధిస్తే
ఇజానికి కాదు నిజానికి ఓటేస్తే
నేటి పౌరులంతా లోక కళ్యాణాన్ని
సత్సమాజ స్వాప్నిక జగత్తును
యదార్థం చేసే రథసారథులవుతారు.



ప్రభువు - ప్రవక్త

సముద్రంలోని జలరాసులను ఆవిరిని చేసి
మేఘాలపై మేఘాల అమోఘ కోటలు పేర్చి
మెరుపు కణాల్ని అందున రాజేసి
ధరిత్రి సర్వత్రా వర్షింపజేశాడు ప్రభువు


భువన రత్నమై గగన ముత్యమయి
లోకంలోని నిమ్నోన్నతలను నిర్మూలించి
సమాజమంతా సత్యాన్ని స్థాపించి
నవ జీవన కాంతిని క్రాంతిని పంచి
నబీలలో నాయకామన్య పీఠాన్ని అధిరోహించి
నింగీనేలలచేత నీరాజనాలందుకున్నాడు
ప్రవక్త (స)

ప్రవక్తా! – మీరు
తైబాను విడిచి వెళ్ళినప్పుడు
భువనగగనాల్లో విషాదం తొంగి చూసింది

కానీ – మీ త్యాగం
వేన వేల పీడిత జన విముక్తికి
స్త్రీ జాతి ఔన్నత్యానికి, ముక్తికి
కారణమైందని తెలిసి
భువన గగనాన గర్వరేఖ మెరిసింది!!

– శాంతిప్రియ

TELGFEBR13FINAL.indd 13 2/5/13 4:30 PM



3 మన సమస్యలు తీరాలంటే...!

విధేయత, సమర్పణ, దాస్యభావన మానవుని నైజంలో అంతర్భాగమయినవి. అతను సంపూర్ణ స్వేచ్ఛాజీవిగా మారాలన్నా మారలేడు. ఒక అధికారి బంధనాల నుండి తప్పించుకున్నా మరో స్వామి దాస్య వలయంలో చిక్కుకుంటాడు. ఒక నియంత పట్టు నుండి తప్పించుకున్నా మరో నిరంకుశ వ్యక్తి కబంద హస్తాల్లో బంధీ అవుతాడు. నేనెవరికీ దాస్యం చేయను, నేనెవరికీ దాసుడను కాను అంటూనే దాస్యాల ఊబిలో దిగజారుతూ పోతాడు. ఒక్కోసారి తన లాంటి మనుషులకు, తనకన్నా అల్పమయిన ప్రాణులకే తల వంచితే, ఒక్కోమారు తన మనోవాంఛలకు దాసోహమంటాడు.

మనిషి ఈ దాస్యం కేవలం మత పరిధిలోనే కాదు; రాజకీయ రంగంలోనూ, ఆర్థిక రంగంలోనూ అతను అనేకుల దాస్యం చేస్తాడు. ఉ–దేశాన్ని (భరత మాత అంటూ) దాస్యం చేస్తే, భాషను (తెలుగు తల్లి) అని మ్రొక్కుతాడు. కులాన్ని (కుల దైవంగా) తలుస్తూ, చదువును (సరస్వతీ అని) కీర్తిస్తాడు. ఒక్క నిజ దేవుని దాస్యాన్ని నిరాకరించిన నరుడు నానా రకాల దాస్యాల కాడిని మోసేందుకు సిద్ధమయి, లేని పోని ఆంక్షల భారాన్ని తనపై వేసుకుంటాడు. ఇటువంటి ఒక వ్యక్తిగానీ, కొందరు వ్యక్తులు గానీ కలిసి ఓ చట్టం తయారు చేస్తే అది సమస్త జనావళికి ఆమోదయోగ్యం కాగలదా? వారు తయారు చేసిన చట్టం సరయినదని తీర్మానించేదెవరు? మానవుని ఏ చేష్ట సమాజానికి హానికరమో? ఏ చేష్ట శ్రేయస్కరమో ఎవరు నిర్ణయించాలి? మనిషి వర్తకం, వ్యవసాయం, విద్య, సంస్కృతి, రాజకీయ రంగాల్లో ప్రగతి గడించడానికి, భావ ప్రకటనకు,రచనా వ్యాసంగానికీ కావలసిన స్వేచ్ఛ పరిమితులేమిటి?

ఒక జాతి, దేశ రాజ్యాంగ రచన ఆ జాతి, దేశ పెద్ద, లేదా కొందరు వ్యక్తులు చేసి పెడతారు అనుకుందాం. వారు చేసే ఆ చట్టం ఆ జాతి వరకు, ఆ దేశం వరకు, ఆ కాలం వరకు పరిమితమయి ఉంటుందన్నది నిర్వివాదాంశం. మరలాంటప్పుడు ఆ చట్టం సదా ఆ జాతిని, ఆ దేశాన్ని సాఫల్య బాటన నడిపించగలదన్న, మేలుగానే పరిణమిస్తుందన్న గ్యారంటీ ఏమిటి?చట్టం చేసే వ్యక్తిగానీ, వర్గంగానీ ఇతరుల (దేశాలు, ప్రజలు) ప్రయోజనాలపైన తమ వ్యక్తిగత, జాతీయ, ప్రాంతీయ అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వలేరన్న నమ్మకంఏమిటి? ముఖ్యంగా అధికార సంపన్నులయిన వారిని ప్రశ్నించే మరే శక్తి లేనప్పుడు ఈ ప్రమాదం మరింత అధికమయ్యే అవకాశాలే ఎక్కువ అన్న విషయం మానవ చరిత్ర తరచి చూస్తే సులభంగా బోధ పడుతుంది. చరిత్ర అనేక దశల్లో మానవులు అధికార మత్తులో మృగాల కన్నా హీనంగా వ్యవహరించారన్నది కాదన లేని సత్యం. పోతే ప్రతి వ్యక్తిలోనూ రాజ్యాంగ రచన చేసే సామర్థ్యం ఉండదు.కాబట్టి ప్రజలు కొందరు ప్రతినిధుల్ని ఎన్నుకుంటారనుకుందాం. వారు చేసిన చట్టాన్నే జాతి చట్టంగా భావిద్దాం. అయినా ఒక దేశం వరకే దాని ప్రయోజనాలు పరిమితం. పైగా ఆ ప్రతినిధులు జాతి ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే జాతి వారిని తొలగిస్తుంది. ఈ క్రమంలో జాతికి ప్రతి కొన్నేళ్ళకోసారి ఇంకొందరిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇక సవరణలు సర్వ సాధారణమే.

ఇక ఓటు, నోటు విషయానికొస్తే, ఏ పార్టీకీ ఓట్లు ఇచ్చే వారి **'అధిక సంఖ్య'** సమర్థన లభిస్తుందో దానికే పట్టాభిషేకం చేయడం జరుగుతుంది. ఈ **'అధిక సంఖ్య'** నిజానికి ఇతర పక్షాలన్నిటి సదృశ్యంగా **'అల్ప సంఖ్య'** కూడా కావచ్చు. ఉదాహరణకు–ఒక చోట ఓటర్లు 50 వేల మంది ఉన్నారనుకోండి. వారి ముందు పది వేర్వేరు దృక్పథాలు ఉన్నాయి. ఓట్లు వేయగా ఒక్కో దృక్పథానికి కాస్త తేడాతో ఓట్లు పడ్డా ఏ దృక్పథానికి అయిదు వేలకు కాస్త ఎక్కువ మంది సమర్థన లభిస్తుందో ఆ దృక్పథమే 50 వేల మందికి ప్రాతినిధ్యం వహించే దృక్పథంగా పరిగణించడుతుంది అంటే, ప్రజా స్వామిక విధానంలో సయితం మహా అయితే 10 లేక 15 శాతం వ్యక్తుల అభిప్రాయాలనే ప్రతిబింబించడం సాధ్యం. ఈ 10 శాతం ప్రజలు మిగతా 90 శాతం ప్రజల అభిప్రాయాలకు సరిగ్గా ప్రతిబింబించగలరని నమ్మకమేమిటి? వారు 90 శాతం ప్రజల శ్రేయోభిలాషులుగా మసలుకుంటారని గ్యారంటీ ఏమిటి? చూడబోతేనేమో ప్రతి వర్గం, ప్రతి దృక్పథం తానే కరెక్ట్ అని బీరాలు పోతుండాయే. అది అధికారంలో ఉండగా మిగతా దృక్పథాల్ని తొక్కి పెట్టే ప్రయత్నం చేయదా? ఒక్క మాటలో చెప్పాలంటే, నియంతృత్వంలో అధికారం ఒక వ్యక్తి వరకు పరిమితమయితే, ప్రాజాస్వామ్యంలో అది ఒక చిన్న వర్గపు ప్రాతి నిధ్యంలోకి మారుతుంది. ఒక నియంత తన అధికారాన్ని నిలుపుకోవడానికి ఏ మేరకు జన సమర్థన అవసరమో, ప్రజాస్వామ్యంలో కూడా జాతిలోని ఒక ప్రత్యేక వర్గాన్ని సంతుష్ట పరచడం అంతే అవశ్యం. అది లేకుండా నియంతృత్వమూ నిలువజాలదు. ప్రజాస్వామ్యమూ మనజాలదు.

ఈ సుదీర్ఘ చర్చానంతరం తేలిందేమిటంటే, సిద్ధాంతాలు, సామాజిక సంబంధాలు, చట్టం–ఈ మూడు సమస్యల్లోనే మనిషి సదా చిక్కుకు పోయాడు. ఈ కారణంగా మహమ్మారి రోగాలు, ప్రకృతి వైపరిత్యాలు సృష్టించిన బీభత్సం కన్నా వందల వేల రెట్లు ఈ దుష్ట నర నైతిక నియమాలే సృష్టించాయి. మనిషి చేసుకున్న చట్టాల ద్వారా నర రుధిరం ఎంతగా పారిందంటే అంతటి వినాశనాన్ని సునామీలు కూడా సృష్టించ లేదు.అంతిమ పరిష్కారంగా ముందుకు వచ్చేది ఒక్కటే. దానుడు బేషరతుగా నిజ దైవానికి విధేయత చూపి, తన్ను తాను సమర్పించుకున్నప్పుడే మానవ సమస్యలు పరిష్కారం అవుతాయి.

అదెలాగో వచ్చే సంచికలో తెలుసుకుందాం!

TELGFEBR13FINAL.indd 14 2/5/13 4:30 PM



విధిరాత 2 నియమాలు

ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: **"అగోచరాల తాళం చెవులు అల్లాహ్ వద్దనే ఉన్నాయి. ఆయనకు తప్ప ఇతరులెవరికి వాటి గురించి తెలీదు. భూమిలోనూ, సముద్రాలలోనూ ఉన్న వస్తువులన్నింటి గురించి ఆయనకు తెలుసు. రాలే ఆకు కూడా ఆయనకు తెలియకుండా ఉండదు. నేలలోని చీకటి పొరలలో పడే ఏ గింజ అయినా - పచ్చిది, ఎండినది ఏది పడినా - స్పష్టమైన గ్రంథంలో నమోదై ఉంది."**

(అల్ అన్‌ఆమ్:59)

'అల్లాహ్ ఆయనే సప్తాకాశాలనూ, అలాంటివే భూములను సృష్టించినవాడు. ఆయన ఆజ్ఞ వాటి మధ్య అవతరిస్తుంది. అల్లాహ్ అన్నింటి పై అధికారం కలిగి ఉన్నాడని, ఇంకా నిశ్చయంగా అల్లాహ్ తన జ్ఞానంతో అన్నింటినీ పరివేష్టించి ఉన్నాడని మీరు తెలుసుకోవటానికి'. (అల్లాహ్ ఈ విషయాలను విశద పరుస్తున్నాడు.) (అత్తలాఖ్:12)

గోచర అగోచరాల జ్ఞానం అల్లాహ్‌కు ఉంది. ఆయన పవిత్ర నామాల్లో **'అలీమ్'** ఒకటి, సకల వస్తువుల, సకల చరాచర సృష్టి సంగతులు తెలిసినవాడు అని అర్థం. మరో పరిశుద్ధ నామం **'సమీవున్'** సకల సృష్టిరాసుల స్వరాలను హృదయ సవ్వడులను సయితం వినేవాడు అని. **'బసీర్'** అన్నది ఇంకో పవిత్ర నామం. సకల చరాచర సృష్టి స్వరూపాన్ని దాని యధాస్థితిలో అన్ని వేళల-పగటి వెలుగులోనూ, రాత్రి మబ్బులోనూ చూడగలిగేవాడు అని అర్థం. ఈ విధమైనటువంటి భావన మన మనస్సులో చోటు చేసుకుంటే సమస్యల, తమస్సులన్ని వాటంతట అవే తొలగిపోతాయి. సత్య ధర్మ ధ్వజవాహకులెవరో, ఆయనకు తెలుసు. సత్య ధర్మ విరోధులు ఎవరో కూడా ఆయనకు తెలుసు.

కర్కశక హృదయుల కుటిల నీతులూ ఆయనకు తెలుసు. అలాంటప్పుడు మనం ఆయన్ను నమ్ముకుని, ఆయన మీద ఏ విధంగా నమ్మకం ఉంచాలో ఆవిధంగా భరోసా ఉంచి మానవ ప్రయత్నంగా మనం చేయగల్గింది మనం చేస్తే, సకల సమస్యలను ఆయనే పరిష్కరిస్తాడు. నేటి మన దుర్భిక్ష స్థితిని సుభిక్షంగా మార్చి వేస్తాడు. ఎందుకంటే ఎన్ని ఇక్కట్లు, ఇబ్బందులు ఎదురైనా **'అంతిమ విజయం దైవభీతిపరులదే'** అన్నది ఆ సర్వేశ్వరుని మాట. మరి ఆయన మాటకంటే సత్యవంతమైన మాట ఎవరిది కాగలదు? ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:**"అల్లాహ్ సహాయాన్ని అర్థించండి, సహనం వహించండి. ఈ భూమి నిశ్చయంగా అల్లాహ్ దే. తన దాసులలో తాను కోరిన వారిని ఆయన దీనికి వారసులుగా చేస్తాడు. అల్లాహ్ పట్ల భక్తిప్రపత్తులు గల వారికే ఎట్టకేలకు అంతిమ విజయం వర్తిస్తుంది."** (అల్ ఆరాఫ్:128)

1) సృష్టిలో ప్రతిదీ అల్లాహ్ అభీష్టం మేరకే జరుగుతుంది:

సృష్టిలో సృష్టిరాసుల ఇచ్ఛతోపాటు దైవేచ్ఛ కూడా ఉండాలి. ఆయనను సమ్మతం కానంత వరకూ ఏవీ సంభవం కాదు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: "సర్వలోక ప్రభువు, పోషకుడు, పాలకుడు, సంరక్షకుడు అయిన అల్లాహ్ కోరనంత వరకు మీరేదీ కోరలేరు."

(అత్తక్వీర్: 29)

'అల్లాహ్ తాను కోరినదాన్ని చేస్తాడు. ఆయన ఆజ్ఞను ఆయన ప్రణాళికను అడ్డుకునే లేక వాయిదా వేయించే వాడెవడూ లేడు. అల్లాహ్ ఏ జాతికినయినా శిక్షించాలనుకుంటే ఇక ఆ శిక్ష తొలగిపోయే ప్రసక్తే లేదు. మరియు ఆయన తప్ప వారిని రక్షించేవారు కూడా ఎవరూ ఉండరు'. (రాద్:11)

"ఒక వేళ అల్లాహ్ నీకేదైనా బాధకు గురిచేస్తే ఆయన తప్ప ఎవడూ దానిని దూరం చేయలేడు. ఒకవేళ ఆయన నీకు ఏదైనా మేలు చెయ్యగోరితే ఆయన కృపను అడ్డుకునే వాడు కూడా ఎవడూ లేడు. ఆయన తన కృపను తన దాసులలో తాను కోరిన వారిపై కురిపిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించేవాడు". (యూనుస్:107)

విధిరాత గురించి నొక్కి వక్కాణిస్తూ దైవ ప్రవక్త(స) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్‌తో ఇలా అన్నారు:**'గుర్తుంచుకో! లోకమంతా ఏకమై నీకు మేలు చేకూర్చాలనుకున్నా అల్లాహ్ నీ కోసం వ్రాసి పెట్టిన దానికన్నా ఎక్కువేమీ వారు నీకు మేలు చేకూర్చజాలరు. ఒకవేళ లోక మంతా నీకు కీడు తలపెట్టాలన్న ఉద్దేశ్యంతో ఏకమైనా కూడా నీకోసం వ్రాసి ఉంచిన దానికంటే ఎక్కువ నష్టమేమీ వారు కలిగించ జాలరు".** (తిర్మిజీ)

ఈ అంశాన్ని అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావించాడు. అంటే, మనిషి ధర్మంలో విభేదాలను సృష్టించుకుని, వైమస్యాలు పెంచుకుని పగతో, ప్రతీకారేచ్ఛతో బ్రతకాలన్నది దేవుని అభిమతం కానేకాదు. అజ్ఞానాన్ని వైమనస్యాన్ని సుతరామూ ఆయన ఇష్టపడడు. తాను సమ్మతించి ఆమోదించిన ధర్మాన్ని మానవులంతా అవలంబించి వారు నరకాగ్నికి ఆహుతి కాకుండా ఉండాలన్నదే ఆయన అభీష్టం. అందుకే ఆయన తన గ్రంథాలను అవతరింపజేసాడు. తన ప్రవక్తలను ప్రభవింపజేశాడు. ఈ సందేశ పరంపరను మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై పరిసమాప్తం చేశాడు.

అల్లాహ్ చూసేది ఒక్కటే - మనిషి తనకివ్వబడిన పరిమిత స్వేచ్ఛాధికారానికి ఎంత వరకు సద్వినియోగం చేసుకుంటాడు? మరెంత మంది దుర్వినియోగ పరచుకుని పరాజితులుగా మిగిలిపోతారు? ఇదే అసలు పరీక్ష. దేవుని ప్రణాళికను యుక్తికి లోబడి ఈ పరీక్ష పెట్టబడుతోంది. ఈ పరీక్షలో ఆయన కొందరికి ఇచ్చి పరీక్షిస్తాడు. మరికొందరిని ఇవ్వకుండా లేదా ఇచ్చింది ఊడబెరికి పరీక్షిస్తాడు. ఈ యదార్థం తెలుసుకున్న దాసుడు దీనాతిదీనం దైవసన్నిధిలో ఇలా విన్నవించుకుంటాడు: "ఓ అల్లాహ్! విశ్వ రాజ్యాధిపతీ! నీవు కోరినవారికి ప్రభుతనిస్తావు.నీవు తలచిన వారల నుండి అధికారాన్ని లాక్కుంటావు. నీవు కోరిన వారికి గౌరవమొసగుతావు. నీవు కోరిన వారిని పరాభవానికి గురి చేస్తావు. సమస్త మేళ్ళూ నీ చేతిలోనే ఉన్నాయి. నిశ్చయంగా నీవు ప్రతి వస్తువుపై అధికారం కలవాడవు." (ఆలి ఇమ్రాన్: 26)

నిజం-రాజును పేదగా మార్చినా, పేదవాణ్ణి రాజ్య పట్టాభిషేకం చేసినా అది ఆయనకే చెల్లుతుంది. ఆగ్రహానుగ్రహాలు ఆయనకే శోభిస్తాయి. అధికారాలన్నింటికి, అధికారులందరికీ యజమాని ఆయనే. ఇది ఎరిగిన మనం ఆయన చేయమన్నదే చేయాలి. ఆయన వద్దన్న వాటిని నిరభ్యంతరంగా పరిత్యజించాలి. అందులోనే మనందరి, మానవులందరి శ్రేయోశుభాలు దాగి ఉన్నాయి.

TELGFEBR13FINAL.indd 15 2/5/13 4:30 PM

ఐపిసి ఆధ్వర్యంలో విహారయాత్ర





11-01-2013 శుక్రవారం ఐపిసి ఆధ్వర్యంలో న్యూ ముస్లింల కొరకు వఫ్రా ప్రాంతంలో ఒక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అన్నీ బ్రాంచీల నుంచి విచ్చేసిన బోధకులు, న్యూ ముస్లింలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో వెన్నుదన్నుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మన్గఫ్ బ్రాంచీ మేనేజర్ న్యూ ముస్లిం సోదరులనుద్దేశించి ప్రసంగించారు. ఆయన అందించిన సందేశాన్ని ఐపిసి ప్రబోధకులు షేక్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు తెనుగీకరించారు. ఈ సందర్భంగా మన రాష్ట్రీయ ఆట కబడ్డీ పోటీలు, సాంస్కృతిక పోటీలు చాల మంచి వాతావరణంలో సాగాయి. క్రీడా పోటీల నిర్వహణా బాధ్యతలు ఐపిసి ప్రబోధకులు షేక్ ముహమ్మద్ బిలాల్ గారు, సయ్యిద్ అహ్మద్ గారు చేపట్టగా, జుమా ప్రసంగం మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు ఇచ్చారు. ప్రశ్నలు సమాధానాల కార్యక్రమాన్ని సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు నిర్వహించగా, భోజన ఇతరత్రా సదుపాయాల ఏర్పాటు మన్గఫ్ బ్రాంచీ తెలుగు ప్రబోధకులు షేక్ హబీబుర్రహ్మాన్ జామయీ గారు చేశారు. ఈ మొత్తం కార్యక్రమానికి ఐపిసి వఫ్రా బ్రాంచీ తెలుగు ప్రబోధకులు షేక్ సలీమ్ ఉమ్రీ గారు రథసారధిగా వ్యవహరించారు. ఆద్యంతం ఆహ్లాదకర వాతావరణంలో వినోదాత్మకంగా సాగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





ఐపిసి ఆధ్వర్యంలో గణతంత్ర దిన సంబరాలు



25-01-2013 శుక్రవారం ఐపిసి సిటీ బ్రాంచీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓ కార్యక్రమం నిర్వహించబడింది. వివిధ రాష్ట్రాలకు చెందిన ముస్లిం, న్యూ ముస్లిం సోదరులతోపాటు 40 మంది ముస్లిమేతర సోదరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించబడిన క్రికెట్ ఆటల పోటీలలో విన్నర్, రన్నర్‌గా నెగ్గినవారికి కప్ ప్రదానం చేసి సన్మానించడం జరిగింది. సభికుల్ని ఉద్దేశించి ఐపిసి ప్రబోధకులు మౌలానా సిఫాత్ ఆలమ్ మదనీ గారు చేసిన ప్రసంగంలో – మా దేహాలు దేశం నుండి దూరంగా ఉన్నాయి కానీ; మా హృదయాలు దేశంలోనే ఉన్నాయన్నారు. అలాగే ప్రజలందరూ పరస్పరం సోదరులగా మెలగవలసిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు. వినోదభరితంగా సాగిన ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది.

TELGFEBR13FINAL.indd 16 2/5/13 4:30 PM

ఒక్కడైన ఆ సృష్టికర్తకే మ్రొక్కండోయి జనులారా!

ఐమన్-జప్రోబ్రాంచీ

ప్రియమైన నా సోదరులారా! మనలో చాలా మంది వారికి తెలియకుండానే ఘోరపాపానికి గురి అవుతున్నారు. అది ఏమిటంటే నిజమైన ఆరాధనకు అర్హత కలిగిన దేవుడు ఎవడని తెలుసుకోకుండా సహాయం చేసిన వారందరికీ రాజ్యం పరిపాలించిన రాజులకు, విద్య నేర్పించిన గురువులకు పూలమాలలు వేసి, విగ్రహాలు నిర్మించి, పాలాభిషేకాలు చేసి అనేక రకాల పూజలు చేస్తున్నారు. వారందరిని సృష్టికర్త అయిన దేవుడితో పోల్చడమే వీరు చేస్తున్న క్షమించ రాని పాపం. దీనినే అరబీలో షిర్క్ అంటారు.

అసలైన దేవుడు ఎవరు?

మనం యూదుల గ్రంథం, క్రైస్తవుల గ్రంథం, హిందూమత వేదాలు పరిశీలిస్తే వాటిలో విశ్వానికి కర్త ఒక్కడే అన్న మాట స్పష్టంగా పేర్కొనబడింది. అయితే ఆయా గ్రంథాలలో మానవ జోక్యం వల్ల మార్పుచేర్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా ఈ గ్రంథాలలో పరస్పర విరుద్ధమైన విషయాలు ఉన్నాయి. ఏకేశ్వరోపాసనా ఉంది, బహుదైవారాధనా ఉంది. ఉదాహరణకు – క్రైస్తవులు దైవప్రవక్త యేసుని దేవుడని, దైవ కుమారుడని పూజి స్తున్నారు. యూదులు కూడా ప్రవక్తనే పూజిస్తున్నారు. అలాగే బౌద్ధులు తమ మత గురువైన బుద్ధుడిని ఆరాధిస్తున్నారు. హిందూ సోదరులు బహుదైవారాధనను ఆచరిస్తున్నారు. సోదరులారా? అసలు నిజమైన దేవుడు ఎవరు? నిజమైన ఆరాధనకు అర్హుడు ఎవడు? ఒకవేళ కొందరు అనుకున్నట్లు అనేక దైవాలే ఉంటే ఈ పాటికి భూమ్యాకాశాలు చిన్నాభిన్నమయిపోయేవి.

సోదరులారా!


మన ఆరాధనలకు, విశ్వాసాలకు అర్హత గల ప్రభువు ఒక్కడే. ఆయనే భూమి ఆకాశాలకు కర్త, విశ్వానంతటికి పాలకుడు, పోషకుడు, జీవన్మరణాలపై అధికారం గలవాడు. ఆయనే ప్రతి వస్తువును ఎలా తలచుకుంటే అలా సృష్టించగలడు, దూతలను, మానవులను, సముద్రాలను, పర్వతాలను, రాళ్ళురప్పలను, కొండలను, తూర్పు పడమరలను, సూర్య చంద్రు లను, నక్షత్రాలను ఇంకా మనకు తెలియని వస్తువులను ఆయనే సృష్టించాడు. ఆయన తప్ప ఇంకెవ్వరూ ఒక చిన్న ఈగ సైతం సృష్టించలేరు. ఆయనే అనంతకరుణామయుడు, అపార కృపాశీలుడయిన అల్లాహ్. ఆయనకు సంతానము లేదు, ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు.

సోదరులారా!

ఈ సృష్టినంతటికి కర్త అయినటువంటి 'అల్లాహ్' గొప్పతనం ఔన్నత్యం వర్ణనాతీతం. ఉదాహరణకు: వీర్య బిందువుని ఓ సురక్షిత చోటులో నిలిపి, ఆ వీర్య బిందువును ఘనీభ వించిన రక్తంగా చేసి, ఆ రక్తపు గడ్డను మాంసపు ముద్దగా మార్చి, దరిమిలా ఆ ముద్దను ఎముకలుగా చేసి, ఆ ఎముకలకు మాంసం తొడిగించి అటుపిమ్మట భిన్నమైన సృష్టిగా ప్రభవించి, ఆడ మగ రూపము దిద్ది, తల్లి గర్భంలో కటిక చీకట్లో తల్లి రక్తాన్ని బిడ్డకు ఆహారంగా చేసి, తొమ్మిది నెలలు తర్వాత తల్లి గర్భం నుంచి బయటకు తెచ్చి, బిడ్డ ఆహారాన్ని తల్లి శరీరంలోనే పాల రూపంలో అమర్చాడు. ఇంతటి శక్తి గల సృష్టికర్త, కరుణామయుడయిన **'అల్లాహ్'**ను ఈ రోజు మనం మరచి రాళ్ళు రప్పలను, చెట్లను, పుట్టలను, రాతి విగ్రహాలను, చనిపోయిన మానవులను ఆ గొప్ప దైవంతో పోల్చి దేవునిగా భావించి ఆరాధిస్తున్నాము. సృష్టికర్త గొప్ప వాడా? సృష్టి గొప్పదా? సృష్టికర్తను వదిలి సృష్టిని ఆరాధించడం నేరం కాదా?

సోదరులారా!

ఇకనైనా మనం అల్లాహ్‌యే సకల ఆరాధనలకు అర్హుడని, ఆయన తప్ప వేరొక దైవం లేడని, ఆయనే అందరికన్నా గొప్ప వాడని తెలుసుకుని ఆయన్నే విశ్వసించి ఆయన్నే ఆరా ధించాలి. అల్లాహ్ పంపిన ప్రవక్తలలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స). అల్లాహ్‌ను ఆయన ప్రవక్త (స)ను విశ్వసించి, వారికి విధేయత చూపటమే ఇస్లాం ధర్మం. కావున ఇస్లాం స్వీకరించి ఇస్లామీయ ధర్మం ప్రకారం జీవితం గడిపినట్లయితే అల్లాహ్ స్వర్గధామాన్ని మనకనుగ్రహిస్తాడు.. అవిశ్వాసంలోనే ఉండి, అధర్మంగానే జీవిస్తే, అలాంటి వారి కోసం భగభగ మండే నరకాగ్ని ఉందని గుర్తుంచుకోండి!



TELGFEBR13FINAL.indd 17 2/5/13 4:30 PM



వేడిని కోల్పోయిన సూర్యుడి చల్లని కిరణాలు చెట్ల కొమ్మలకు పూచిన పూరేకుల మీద పడి మెరుస్తున్నాయి. ఐదుగురూ వెదురు వంతెన దాటి అవతల వైపు చేరుకున్నారు. ఒక్క క్షణం తీక్షణంగా చుట్టూ చూస్తూ పసుపు ఎరుపుల మిశ్రమమయిన ఎండ ఎంతో అందంగా ఉంది. ఏపుగా పెరిగిన వరిచేలు పచ్చగా నవ్వుతున్నాయి. వాళ్ళు నడిచి వెళుతున్న ఆ దారికి ఇరుప్రక్కలా ఉన్న పెద్ద పెద్ద వృక్షాల మీద గుంపులుగా చేరిన రంగు రంగుల రామచిలు కలు కువకువలాడుతున్నాయి. ఆ కిలకిలరా వాలు దాటి వెళ్ళగానే గలగలపారే యేటి శబ్దం! ఆ ప్రదేశం పేరే ఇలకోన. ఆ నీళ్ళు ఆ కొండల్లో ఎక్కడ నుంచి వస్తాయో తెలియదు. ఎప్పుడూ పడుతూనే ఉంటాయి. వర్షాకాలంలో కొండల మీద పడిన నీరు కూడా అందులో ఏకమైనప్పుడు చాలా ఉధృతంగా, అద్భుతంగా ఉంటుంది ఆ జల పాత దృశ్యం.

ఆ అడవిలో రాళ్ల మీద నీళ్ళు పడుతున్న ఆ శబ్దం, కనిపించకుండా ఇలా వినిపించడం చాలా బాగుంది. చాలా రోజుల తర్వాత కల సిన ఆ స్నేహితులు సరదాగా టూర్ ప్లానింగ్ చేసుకుని ఆ ప్రదేశానికి వచ్చారు. అక్కడ రెస్ట్ హౌస్ సౌకర్యం ఉండటం ఒకవిధంగా వారం దరికి కలిసొచ్చింది. సంధ్యా సమయం కావొ స్తుంది గనక రాత్రి రెస్ట్‌హౌస్‌లో గడిపి తెల్లా రాక ఆ ప్రాంత దృశ్య లావణ్యాన్ని కళ్ళారా చూసి మనసారా ఆస్వాదించుదాం అన్న ఏకా భిప్రాయంతో అందరూ రెస్ట్‌హౌస్‌లోకి ప్రవే శించారు. సూర్యుడు మళ్ళీ ఉదయిస్తానని మాటిచ్చి సెలవు తీసుకున్నాడు.

అప్పుడే భోజనాలు పూర్తి చేసుకున్న ఆ అయి దుగురు బైట వేయబడి ఉన్న అరుగుల మీద కూర్చున్నారు. ఒకడెళ్ళి కట్టెలకి నిప్పంటించి వచ్చాడు. వారి మధ్య మాటామంతి సాగింది. చాలా సేపు చలోక్తులు విసురుకుంటూ, జోకు లేసుకుంటూ సరదాగా సాగిన వారి సంభా షణ కాస్త సీరియస్ మ్యాటర్ వైపు మళ్ళింది. కారణం – లెనిన్ ఇచ్చిన ఓ కొటేషన్!

లైనిన్: ఈ ప్రపంచంలో మనుషులు రెండు రకాలు-బుద్ధిగలవారు, బలం గలవారు. బుద్ధి మంతులు నీతిని వదలి పెడితే రాజకీయ నాయకులవుతారు. నీతికి కట్టుబడితే మేధావు లో, బోధకులో అవుతారు. బలం గలవాడు నీతిని వదిలితే రౌడియో, గూండానో అవు తాడు. నీతికి కట్టుబడితే శ్రామికుడో, కర్షకు డో అవుతాడు."

కొందరు విభేదించారు. కొందరు లెనిన్‌ను సమర్థిస్తూ అతని పక్షాన నిలిచారు. చాలా సుదీర్ఘంగా సాగిన ఆ చర్చ 'లేనిన్' మరో ప్రశ్నతో ఊహించని రీతిలో మలుపు తిరి గింది. ఆ మలుపే తర్వాత వారి జీవితాల్లో అతి గొప్ప మార్పుని తీసుకొచ్చింది. ఇంతకీ ఏమిటా ప్రశ్న?

+++++++++++++++++++++++++++

"చరిత్ర పుటల నుండి ఇస్లాంను తొలగించి వేస్తే చరిత్రలో వచ్చే లోటు ఏమిటి"?

వహీద్: ఏమిటంటారా? "ఇస్లాం సంపూర్ణం అవక ముందు ఏ లోటు ఉండేదో అదే లోటు ఉంటుంది."

ఈ సమాధానం వినగానే 'లెనిన్' నిశ్శబ్దంగా ఉండిపోయాడు. వహీద్ చెప్పనారంభించారు- దేన్నయితే మనం ప్రగతి అని పిలుస్తున్నామో అది ఇస్లాం ఆవిర్భావానికి ముందు లేదు. వైజ్ఞానిక, సాంకేతిక, పారిశ్రామిక ప్రగతిని సాధించి చూపడం మాత్రమే ఇస్లాం ముఖ్యో ద్దేశం అని నేనటం లేదు. అది ఇస్లాం ప్రధాన ఉద్దేశ్యం కాదు కూడా. అయితే ఇస్లాం ఆవి ర్భావం- వైజ్ఞానిక, సాంకేతిక, ఆర్థిక, పారిశ్రా మిక రంగాలలో జరిగిన ప్రగతికి సోపానం అయిందనేది మాత్రం నిర్వివాదాంశం. ఒక వేళ 'తౌహీద్' విప్లవమే గనక లేకపోయి ఉంటే వైజ్ఞానిక, సాంకేతిక, పారిశ్రామిక ప్రగ తులు కూడా ఉండేవి కావు.

లెనిన్: అంటే; మీ ఉద్దేశ్యం?

వహీద్: ఫలాన్ని అందజేయడమే వృక్షం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. కాని ఆ వృక్షం శాఖోపశాఖాలుగా విస్తరించినపుడు అది ఫలాన్ని మాత్రమేగాక నీడను సయితం అంది స్తుంది. ఇస్లాం కూడా అంతే. అది మానవ హృదయ సీమలో 'తౌహీద్' బీజాన్ని నాటు తుంది. ఆ బీజం మహా వృక్ష సృజనకు కారణ మయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. దానికి పూచే ఒక్కొక్క పువ్వు నుంచి, ఒక్కొక్క పండు నుంచి సత్యామృతం జాలువారుతూ ఉంటుం ది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇస్లాం-ఆపాద మస్తకం శాంతి శ్రేయాల ధర్మం. అందులో సత్యం మూర్తీభవించి ఉంది. అది సర్వకాల సర్వావస్థల్లోనూ సమస్త మానవాళి కోసం శుభప్రదమయిన ధర్మం.

లెనిన్: బాల్యంలో మీ నాన్నగారి ద్వారా విన్న మాటల వల్ల నాలో దైవభక్తి ఉండేది. దేవు డంటే నమ్మకముండేది. కాని ఇప్పుడెందుకో ఆ విషయం నమ్మశక్యంగా అన్పించడం లేదు. పంచేంద్రియాలు, పరిధిలోకి రానిది ఉందని ఎలా నమ్మాలి?

వహీద్: రెండు బంతులున్నాయి. ఒకటి ఇను ముది. మరొకటి ఇనుము పూత పూయ బడిన కొయ్యది.రెండూ చూడ్డానికి ఒకేలాగున్నాయి. భూమి మీద పడి ఉన్న ఆ రెండు బంతుల్ని తాకి, రుచి చూసి, పరిశీలించి, విని, వాసన చూసి అంటే పంచేంద్రియాల్ని ఉపయోగించి పసిగట్టగలమా?

లెనిన్: అంత మాత్రానికి ఇంత హడావుడి ఎందుకు? ఎత్తి చూస్తే సరి?

వహీద్: ఎత్తి చూడమని మీకు పంచేంద్రియా లు పురమాయించాయా? బుద్ధి దోహదకారి అయ్యిందా?

లెనిన్: బుద్ధి చెప్పిన మాటే.

వహీద్: అంటే దైవాన్ని గ్రహించడానికి కావా ల్సింది పంచేంద్రియాలు కావు; బుద్ధి కావాలి

TELGFEBR13FINAL.indd 18 2/5/13 4:30 PM



లెనిన్: బుద్ధి ఉపయోగిస్తే సృష్టికర్త ఎవరో తెలుసుకోగలమా?

వహీద్: ఖచ్చితంగా.

లెనిన్: కాస్త అర్థమయ్యేటట్టు చెబితే బాగుంటుంది కదా!

వహీద్: ఫారడె కనుక్కున్న విద్యుత్శక్తి వల్ల ఒక గది కాంతివంతమవుతుంది. ఎనిమిది పది బల్బుల వల్ల ఒక భవంతి ప్రకాశమానమవుతుంది. వంద రెండు వందల బల్బులు వల్ల పూర్తి వాడ దేదీప్యమానమవుతుంది. ఒక పెద్ద పట్టణానికి వెలుగువంతం చెయ్యాలంటే కొన్ని వేల బల్బులు అవసరమవుతాయి. అదే విధంగా ఒక రాజ్యాన్నే పూర్తి స్థాయిలో కాంతిమయం చేయాలంటే ఎన్ని పథకాలు రూపొందుతాయి. ఎంత మంది ప్రజల సేవలు వినియోగించబడుతాయో ఎంత హెచ్చు స్థాయిలో విద్యుత్ తయారు చేయవలసిన అవసరం ఉంటుందో వివేచనాపరుడైన ప్రతి వ్యక్తికీ తెలిసిందే. మీకూ తెలుసు!

ప్రతి రోజూ ఒక అఖండమైన బల్బ్ ఉదయించి మొత్తం ప్రపంచాన్ని వెలుగులతో నింపేస్తుంది. కర్రి మబ్బుల్ని కొన్ని నిమిషాల్లో పారద్రోలుతుంది. దాని కిరణాలు అటు సముద్రాలపై, ఇటు పర్వత శ్రేణులపై సయితం పడతాయి. దాని వెలుతురు ఇటు జనవాసాల్లో, అటు వనాల్లో అన్ని చోట్ల ప్రసరిస్తుంది. ఆ ఒకే ఒక్క సహజసిద్ధమైన బల్బ్ సహస్రకోటి జీవరాసుల్ని నిద్ర నుంచి మేల్కొల్పుతుంది. కొంత సమయం గడిచాక అదే బల్బ్ చల్లబడుతుంది. క్రమేణా అది అస్తమిస్తుంది. రాత్రి అవుతుంది. కటిక చీకట్లు మళ్ళీ రాజ్యమేలుతాయి. అంతలో వెన్నెల్ని వెదజల్లుతూ మరో చల్లని బల్బ్ లోకాన్ని పండు జాబిలిలో నిండు స్నానాలు చేయిస్తుంది. పగలంతా పరిశ్రమించిన మనిషి అలసిసొలసి పడక మీద మేను వాల్చి నిద్ర ఒడిలోకి మెల్లగా జారుకుంటాడు.

సోదరులారా! ఇప్పుడు చెప్పండి!! దేశం మొత్తం ఒకే సమయంలో మసక చీకట్లో మునిగిపోయి, తిరిగి దేశం మొత్తం ఒకే సమయంలో కాంతివంతమవడాన్ని పరిశీలిస్తే ఈ విశ్వ వ్యవస్థ వ్యవహారం కేవలం విస్ఫోటన పరిణామంలా గోచరిస్తుందా? లేదా మనిషి రూపొందించిన వ్యవస్థలా తోస్తుందా? ముమ్మాటికీ కాదు! ఇది ఆ అఖండ జ్యోతిశ్వరుడైన అల్లాహ్ రూపొందించిన వ్యవస్థ! ఆయనే పగలును రాత్రిగా, రాత్రిని పగలుగా మారుస్తున్నాడు. ఆయనే విశ్వం మొత్తాన్ని వెలుగు జిలుగులతో నింపుతున్నది. ఖుర్ఆన్ లో ఇలా ఉంది:

"సూర్యుణ్ణి ప్రకాశమానంగానూ, చంద్రుణ్ణి కాంతిమంతంగానూ చేసినవాడు ఆయనే". (యూనుస్:5)

"అల్లాహ్ ఆకాశాలనూ, భూమిని, జ్యోతిర్మయం చేసే (అఖండ) కాంతి". (నూర్:35)

తరచూ దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించేవారు: **"సకల స్తోత్రాలు నీకే తగును స్వామీ! భూమ్యాకాశాలకూ, వాటి మధ్యనున్న సమస్తానికీ నీవే కాంతివి."** (బుఖారీ)

తన సత్తాకు తానే మత్తెక్కి, కళ్ళుపైకెక్కి, కామం, మోహం, లోభం, మదం, మత్సర్యాలకు లోనై సృష్టికర్తనే ప్రశ్నించే స్థాయికి ఎదిగి (?) పోయిన వారందరిని (ఓ ప్రవక్తా!) అడుగు: **'చూడండి! ఒకవేళ అల్లాహ్ ప్రళయ దినం వరకూ మీపై రాత్రిని శాశ్వతంగా ఆవరింపజేస్తే అట్టి పరిస్థితిలో అల్లాహ్ తప్ప మీ వద్దకు (పగటి) వెలుతురును తెచ్చే దేముడు ఎవడున్నాడు? మరి మీరు వినరేమిటి?"** (ఖసస్:71)

(ఓ ప్రవక్తా!) వారిని అడుగు: **"చూడండి! ఒకవేళ అల్లాహ్ ప్రళయ దినం వరకూ మీపై పగలును శాశ్వతంగా విధించినట్లయితే అప్పుడైనా అల్లాహ్ తప్ప మీ వద్దకు మీరు విశ్రాంతిని పొందేందుకు రాత్రిని తేగల దేవుడెవడు? మరి మీరు గమనించరేమిటి?"** (ఖసస్:72)

"ఆయనే అల్లాహ్. ఆయన తప్ప వేరొకరెవరూ ఆరాధనకు అర్హులు కారు. ఆదిలోనూ, అంతంలోనూ ఆయనే స్తుతింప దగినవాడు". (ఖసస్:70)

సూర్య చంద్ర నక్షత్రాల గురించి తబిసీళ్ళు చేస్తున్న మనం వాటిని సృష్టించిన ఆ సృజన కారుణ్ణి ఎందుకు కనుక్కోలేకపోతున్నాము. అండ, పిండ బ్రహ్మాండాల్ని సృష్టించిన ఆ సృజనశీలుడే నిన్ను, నన్ను, మనందరిని పుట్టించాడు. కాబట్టి ఈ సృష్టి మొత్తంలో ముందు అల్లాహ్‌ను గ్రహించడం ప్రతి మనిషి విధ్యుక్త ధర్మం. తప్పనిసరి, తక్షణ కర్తవ్యం.

సంజయ్: సృష్టికర్త ఉన్నాడు. ఆయన ఒక్కడే అన్న మాట నిజమయితే – 33 కోట్ల మంది దేవుళ్ళు, 54 కోట్ల మంది భగవానుల సంగతేమిటి? వారు దేవుళ్ళు కారా? మానవకారంలో అవతరించిన భగవానులు లేరా?

వహీద్: ఖుర్ఆన్ ప్రకారం దైవప్రవక్తలు ప్రతి జాతిలోనూ వచ్చారు. వారందరూ అందజేసిన సందేశం ఒక్కటే. **"మీరు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప మీ కొరకు వేరొక ఆరాధ్యుడు (ఇలాహ్) లేడు".** మీ తన, ధన ప్రాణాలను ఆయన్నే సమర్పించండి. ఆయన ముందు మీరు బేషరతుగా లొంగి పోండి. కాని మనిషి భావ దాస్యానికి షైతాన్ ప్రలోభానికి లొంగిపోయాడు. దైవం ఒక అగోచర సత్యం. మనిషి అగోచరుడయిన దేవునిపై తన ధ్యాసను నిలువలేకపోయాడు. అతను గోచరాలవైపు మొగ్గాడు. తనకు అందంగా, అఖండంగా కనిపించే అండ పిండ బ్రహ్మాండాలను దైవమనుకొని, దైవాంశ సంభూతం అనుకొని ఆరాధించసాగాడు.

TELGFEBR13FINAL.indd 19 2/5/13 4:31 PM

అలా ఒకవైపు కొందరు వ్యక్తులకు లేని పవిత్రతను అంటగట్టి ప్రార్థిస్తే, మరో వైపు ప్రకృతి పూజా పరంపర ప్రారంభమయింది. దీన్నే మనం **"పెనో మెనల్ వర్‌షిప్"** లేదా **"నేచర్ వర్‌షిప్"** అని అంటాము. దీన్నే ధార్మిక పరిభాషలో **'షిర్క్'**గా వ్యవహరిస్తారు.

ఈ బహుదైవోపాసనా భావం మూలంగా అనేక మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు రూపొందాయి. మరో మాటలో చెప్పాలంటే సకల మూఢ నమ్మకాలకు, విశ్వాసాలకు మూలం షిర్క్ పవిత్రత, ప్రత్యేకతల పేరుతో ప్రారంభమయిన ఈ బహుదైవారాధనా భావం స్వార్థపరులైన మత నాయకులకు, కుమతులయిన పీష్వాలకు సువర్ణావకాశంగా పరిణమించింది. కనుక వాళ్ళు ఈ నమ్మకాన్ని మరింత వ్యవస్థీకృతం చేశారు, చేస్తున్నారు. ప్రభువుకి-ప్రజలకు మధ్య తమను తాము మధ్య వర్తులుగా, వారధులుగా ప్రకటించుకొని జనసామాన్యాన్ని సులువుగా దోచుకున్నారు-కుంటున్నారు. మతాధిపతుల ప్రసన్నతలోనే దైవ ప్రసన్నత ఇమిడి ఉందనే విషగుళికల్ని మానవ సీమల్లో వెదజల్లారు.

ఈ అంధ విశ్వాసాల ప్రచారం ద్వారా అందరికన్నా అధిక లాభం పొందినవారు రాజులు. అందుకు **"గాడ్ కింగ్"** అన్న పాచిక బాగానే పని చేసింది. ఈ సిద్ధాంతం మూలంగా రెండు చెడుగులు సమాజంలో కోరలు చాచాయి. (1) రాజకీయ, రాచరిక వ్యవస్థలోని చెడుగులు పరాకాష్ఠకు చేరాయి. (2) రాజులను మార్చడం ప్రజల తరం కానిది అన్న నమ్మకం ప్రబలింది. ఎందుకంటే రాజు భగవత్ స్వరూపుడు, దైవాంశ సంభూతుడయిన చక్రవర్తిని పదవీచ్యుతుణ్ణి చేయజూడటం మహా పాపంగా తలపోసేవారు అప్పటి ప్రజలు. మరి అలాంటప్పుడు చక్రవర్తి పెట్టే హింసల నుండి ముక్తిలయ్యే దారి ఏది? ఈ కారణం గానే ఫిర్‌ఔన్ కార్మిక, కర్షక జనానికి సంబంధించిన 70 వేల మంది మగ పిల్లల్ని చంపినా వారు అతని మీద తిరుగుబాటుకి సాహసించలేక పోయారు. ప్రవక్త మూసా (అ) వారు వచ్చేంత వరకూ వారు అదేభావ దారిద్ర్యానికి కట్టు బానిసలై బ్రతికారు. అదే విధంగా **'నమ్రూద్'** అనే ఒక నియంత చక్రవర్తి **'తానే దైవం'** అని ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)తో వాగ్వివాదానికి దిగాడు. **"నువ్వే గనక దైవం అయితే తూర్పున ఉదయించే సూర్యుణ్ణి పడమర నుండి ఉదయింపజేసి తూర్పున అస్తమింపజెయ్యి"** అన్న సవాల్ విసిరే సరికి దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయింది. చివరికి ఫిర్‌ఔన్ నైలు నదిలో గుటుక్కుమంటే, నమ్రూద్ ఓ కుంటి దోమ కారణంగా చచ్చి ఊరుకున్నాడు.

సంజయ్: మరి భారత ప్రాచీన గ్రంథాల సంగతేమిటి? అన్ని వేదాల్లో ఉన్నాయి అంటారు కదా! అసలు వేదాల్లో ఏముంది? వాటి ప్రత్యేకత ఏమిటంటారు?

వహీద్: మీ ప్రశ్నలకు జవాబు చాలా సుదీర్ఘమయినది. భారతీయ మతాల అవగాహన లెనిన్‌కు బాగా ఉంది. దీనికి సమాధానం అతని ద్వారానే విందాం. అయితే ఇప్పుడు సమయం రాత్రి 12 గంటలు. రేపు ఉదయాన్నే లేవాల్సి ఉంది గనక దీన్ని వాయిదా వేసుకుందాం. అందరూ ఏకీభవించారు. అనంతరం రెస్ట్‌హౌస్‌కెళ్ళి నిద్రకు ఉపక్రమించారు.

నెలవంక ఉత్తరాలు

నెలవంక తెలుగు మాస పత్రికలో ముద్రణ లోపాలు

గౌరవనీయులయిన సంపాదకుల వారికి;
గత కొంత కాలం నుండి **నెలవంక** సంచికలో అచ్చుతప్పులు సాధారణమైపోయాయి. అవి రచయితల వైపు నుండో మరి ముద్రణకు ముందు జరిగే కూర్పులోనో గమనించగలరు. ఒకవేళ కూర్పులో అయితే మరింత జాగ్రత్త వహించగలరు. ఏది ఏమయినప్పటికిన్నీ మధ్య ప్రాచ్యంలో తెలుగు ప్రజల కొరకు తేట తెనుగు భాషలో ప్రచురిస్తున్న **నెలవంక** మాసపత్రిక యాజమాన్యానికి, సంపాదక వర్గానికి అందుకు సహకరిస్తున్న రచయితలకు మరియు ఆదరిస్తున్న పాఠకులకు అభినందనలు.

చూడ ముచ్చటగా ఉంది

నెలవంక చూసాను. అసాంతం చదివాను కూడా. చూడ ముచ్చటగా ఉంది. వ్యాసాలు విజ్ఞానదాయకంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ చదవాల్సిన పత్రిక **నెలవంక.** వినోదం, విశ్వాస ప్రక్షాళనం, సత్య దర్శనం మేళవించి అందమైన ఆకృతిలో తెలుగు ప్రజానికానికి అందిస్తున్న **నెలవంక** యాజమాన్యానికి ధన్యవాదాలు. అల్లాహ్ అందరి సేవల్ని స్వీకరించి పరలోక సాఫల్యానికి మార్గం సుగమం చేయాలని ప్రార్థిస్తున్నాను.

– హాఫిజ్ అబ్దుల్ గఫ్ఫార్ ఉమ్రీ
బహ్‌రైన్ డిస్కవర్ ఇస్లాం తెలుగు విభాగం

ఐపిసి తెలుగు విభాగం

షేఖ్ అబ్దుస్సలామ్ ఉమ్రీ (ఖైతాన్ బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 66415927
షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ (మన్సఫ్ బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 97258148
షేఖ్ సలీమ్ ఉమ్రీ (వఫ్రా బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 60705344
షేఖ్ అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ (సిటీ బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 6047386
షేఖ్ ముహమ్మద్ బిలాల్ (జహ్రా బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 99928380
సయ్యిద్ అహ్మద్ (జహ్రా బ్రాంచీ)
మొబైల్ నెంబరు: 50249030
షేఖ్ ముహమ్మద్ సలీమ్ జామయీ
మొబైల్ నెంబరు: 99667860

TELGFEBR13FINAL.indd 20 2/5/13 4:31 PM














టి.ఎమ్.ఎ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సంబరాలు

26-01-2013 శనివారం టి.ఎమ్.ఎ ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుల కొరకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన నాయకులు, అధినాయకులు పాల్గొన్నారు. **'ఓ ప్రజలారా! మీరు ఒకే తల్లిదండ్రుల బిడ్డలు'** అన్న దివ్య వచన భావామృతంతో ప్రారంభ యిన ఈ కార్యక్రమంలో తొలి పలుకులు టి.ఎమ్.ఎ మాజీ అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ హనీఫ్ గారు చెబుతూ – గణ తంత్ర దిన నేపథ్యాన్ని చాలా చక్కగా వివరించడమే కాక స్వాతంత్ర సంగ్రామంలోని కొన్ని ఘట్టాలను ఉటంకిస్తూ మనకు తెలిసిన సమరయోధుల గాధలే కాక చరిత్రలో అంత ప్రాముఖ్య తకు నోచుకోని అనేకమంది త్యాగాల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి వక్కాణించారు. తర్వాత మధురమయిన స్వరంతో **'సారే జహాఁసే అచ్ఛా హిన్దుస్తాన్ హమారా'** అనే జాతీయ గేయాన్ని కడప సోసైటీ వ్యవస్థాపకులు షేక్ ఇస్హాఖ్ అలీ గారు తెలుగులో ఆలాపించి శ్రోతల్ని ఉర్రూతలూగించారు. ఆ పిదప ప్రజాస్వామ్యానికి సరైన నిర్వచనం చెబుతూ శ్రీ యజ్దానీ గారు చెప్పిన మాటలు ఓ కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆనక సాగిన కార్యక్రమంలో సోదరులు శ్రీ చింతల చంద్రశేఖర్ రెడ్డి గారు, శ్రీ పాండు రంగారావు గారు, శ్రీ ముదిరే పల్లి సుబ్బారాయుడు గారు తమ తమ అభిప్రాయాల ను తెలియజేశారు. అంతిమంగా **'దేశాభిమానం'** అన్న అంశంపై **నెలవంక** ఎడిటర్ సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు ప్రసంగిస్తూ, **'ఇటువంటి సమావేశాలను సర్వసామాన్యం చేయాలని, అప్పుడే దేశ పౌరుల మధ్య సౌహార్ద్రత, సుహృద్భావ వాతావరణం నెలకొని దేశ శాంతికి దోహదకారి కాగలద'**ని అన్నారు. అలాగే **'కువైట్‌లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సంస్థలు, సమితులు – కుల, మతాలకతీతంగా దేశ ప్రజల శ్రేయార్థం ఒక వేదిక మీదికి రావాల్సి ఉందని, ఒండొకరి మధ్య సహిష్ణుతా భావం నెలకొనాల్సి ఉంద'**న్నారు. ఈ మొత్తం కార్యయక్రమానికి తనదైన శైలిలో టి.ఎమ్.ఎ అధ్యక్షులు శ్రీ షౌకత్ అలీ ఖాన్ గారు కన్వీనర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. సామ రస్య వాతావరణంలో సాఫీగా సాగిన ఈ కార్యక్రమం సోదరులు నవాబ్ ఖాన్ గారి కృతజ్ఞతా పలుకులతో విజయవంతంగా ముగిసింది.

అలాగే 27-01-2013 తేది ఆదివారం మరో కార్యక్రమం ఫర్వానియా రాయలసీమ హాలులో నిర్వహించడం జరిగింది. దాదాపు 100 మంది తెలుగు సోదరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో టి.ఎమ్.ఎ కార్యకర్తలు, ఐపిసి సిటీ బ్రాంచీ ప్రబోధకులు, సోదరులు శ్రీ నజీబుద్దీన్ గారు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి ఇచ్చిన నిర్వచనం అందరిని ఆకట్టుకుంది. ఖుర్‌ఆన్ పారాయణంతో మొదలయిన **'ఘన తంత్రం మన గణ తంత్రం'** ఈ కార్యక్రమం గేయాలపన, ప్రసంగం, ప్రశ్నోత్తరాల తోపాటు సోదరులు న్యామతుల్లాహ్ గారి తుది పలుకులతో దిగ్విజయంగా ముగి సింది.

TELGFEBR13FINAL.indd 21 2/5/13 4:31 PM


కువైట్ 52వ స్వాతంత్ర్ర దిన శుభాకాంక్షలు!